# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 13 సంచిక : 5 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 9 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :5 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 9 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## నేడు కోనసీమ జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన..

- మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ
- రైతులతో నేరుగా సమావేశమై సమస్యలు తెలుసుకోనున్న సీఎం
- గ్రౌండ్ రెంట్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియకు శ్రీకారం
- 1,416 కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా కీలక నిర్ణయం

- మిగతా 2లో

## చంద్రబాబు అరెస్ట్‌కు మూడేళ్లు..

### నేడు 'నిజం గెలిచింది' కార్యక్రమానికి పిలుపునిచ్చిన నారా లోకేశ్

- నేడు 53 దీపాలు వెలిగించండి.. టీడీపీ శ్రేణులకు లోకేశ్ కీలక సందేశం
- పార్టీ, పర్సనల్, ప్రభుత్వం అనే మూడు 'పీ'ల సూత్రాన్ని నేతలు పాటించాలని దిశానిర్దేశం
- కార్యకర్తల పోరాటాలు, త్యాగాల వల్లే టీడీపీ అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్య
- వైసీపీ దుష్ప్రచారాలను ఐక్యంగా తిప్పికొట్టాలని శ్రేణులకు సూచన
- ఇది టీడీపీ 3.0 వెర్షన్.. అహంకారం వీడి సేవ చేయాలని నేతలకు హితవు

- మిగతా 2లో



## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- స్థానిక ఎన్నికలు.. అత్యుత్తమ అభ్యర్థులను ఎంపిక చేయాలి: సీఎం చంద్రబాబు
- కూటమిలో సమన్వయంతో పనిచేయాలని సూచన
- పార్టీకి నష్టం చేస్తే సస్పెన్షన్ తప్పదని హెచ్చరిక
- ప్రభుత్వ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు



**పెన్ పవర్ డెస్క్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపేలక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక నుంచి క్షేత్రస్థాయి సమన్వయం వరకు ప్రతి అంశంలోఅప్రమత్తంగా ఉండాలని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు. అమరావతిలో నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లోస్థానిక ఎన్నికల సన్నాహాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. గెలుపే లక్ష్యంగాపనిచేస్తూనే కూటమిలో బ్యాలెన్సింగ్ పాటించాలని సూచించారు. సీట్లు, రిజర్వేషన్లపై కొందరు కోర్టులకు వెళ్లినా.. ప్రత్యక్ష ఎన్నికలద్వారా మేయర్లు, ఛైర్మన్లను ఎన్నుకునేలా నిర్ణయం తీసుకున్నామని చంద్రబాబుతెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా.. పార్టీకి, ప్రభుత్వానికిచెడ్డపేరు రాకుండా అత్యుత్తమ అభ్యర్థులను ఎంపిక చేయాలని ఆదేశించారు. కమిటీలద్వారా అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలనిసూచించారు. రాగద్వేషాలకు అతీతంగా క్షేత్రస్థాయిలో నేతలంతా కలిసికట్టుగాపనిచేయాలన్నారు. పార్టీకి నష్టం కలిగించే చర్యలకు పాల్పడితే సస్పెన్షన్‌వేటు తప్పదని హెచ్చరించారు.కూటమి ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు.. వైకాపా దుష్ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని చంద్రబాబు స్పష్టం చేశారు. వైకాపా ఫేక్ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టి ఓటు బ్యాంక్‌ను మరింత బలోపేతం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఓటు వేయని వారినీ చేసిన అభివృద్ధితో ఆకట్టుకుని పార్టీకి అనుకూలంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.

## ఎల్‌నినో.. తాగునీటికే మొదటి ప్రాధాన్యం

- ఏపీలో 54% లోటు వర్షపాతం నమోదైందని చంద్రబాబు వెల్లడి
- సంక్షోభంలో తాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం
- బోర్లు ఎండిపోయిన ప్రాంతాల్లో తాగునీటి కొరత రాకుండా చర్యలు
- పీఎండీఎస్ విధానంతో పంటల సాగును ప్రోత్సహించాలని సూచన
- జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గాయని ఆందోళన
- ఉచిత ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా అడ్డుకోవాలని ఆదేశం

- మిగతా 2లో


## వైసీపీ నుంచి టీడీపీలోకి ఇంకా వస్తారు

### టీడీపీలో చేరిన అనంతరం చిన్న శ్రీను వ్యాఖ్యలు

- వైసీపీ సీనియర్ నేత బొత్స మేనల్లుడు చిన్న శ్రీను టీడీపీలో చేరిక
- వైసీపీ నుంచి ఇంకా చాలామంది టీడీపీలోకి వస్తారంటూ సంచలన వ్యాఖ్యలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో కుమార్తెతో సహా పార్టీలో చేరిక
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనే ఈ నిర్ణయం తీసుకున్నానని వెల్లడి
- చిన్న శ్రీను వ్యాఖ్యలతో ఏపీ రాజకీయాల్లో వలసలపై కొత్త చర్చ

- మిగతా 2లో







## తెలంగాణ పోలీసు ఉద్యోగ అభ్యర్థులకు గుడ్ న్యూస్..

### దరఖాస్తు గడువు పెంపు

- తెలంగాణ పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు
- సెప్టెంబర్ 16 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం
- మొత్తం 7,437 పోస్టుల భర్తీకి జూలై 29న నోటిఫికేషన్
- ఇప్పటివరకు 2.88 లక్షల మంది దరఖాస్తు ప్రక్రియ పూర్తి
- చివరి నిమిషంలో సాంకేతిక సమస్యలు రావొచ్చని బోర్డు సూచన

- మిగతా 2లో

## నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం




- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
- వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ
- పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్

**పెన్ పవర్ డెస్క్:**గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు.

- మిగతా 2లో

## యూరియా కలిసిన దాణా తిని 18 ఆవుల మృత్యువాత




**పెన్ పవర్ డెస్క్:** యూరియా కలిసిన దాణా తినడంతో ఆవులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదలలోని గోశాలలో చోటుచేసుకుంది. ఓ రైతు నిల్వ చేసిన బస్తాల్లోని యూరియా వర్షానికి కరిగి గోవుల దాణాలో కలిసింది. మంగళవారం ఉదయం ఆ దాణా తినడంతో 18 ఆవులు మృతిచెందాయి.

- మిగతా 2లో

## తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో సంచలన తీర్పు.. దోషికి ఉరిశిక్ష

- తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో పోక్సో కోర్టు సంచలన తీర్పు
- ప్రధాన నిందితుల్లో ఒకరికి మరణశిక్ష విధింపు
- మరో ఇద్దరికి 20 ఏళ్లు, 13 ఏళ్ల జైలుశిక్ష
- 2022లో మైనర్‌పై పెళ్లి పేరుతో అత్యాచారానికి పాల్పడిన నిందితులు

- మిగతా 2లో



## అసెంబ్లీ ఆవరణలో కుప్పకూలిన ఐఏఎస్ నవీన్ మిట్టల్ పర్సనల్ సెక్రటరీ రాజు మృతి

**పెన్ పవర్ డెస్క్:** తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ పర్సనల్ సెక్రటరీగా పనిచేస్తున్న రాజు మృతి చెందారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో

- మిగతా 2లో



## సెప్టెంబరు 11న మోదీ-పుతిన్ భేటీ

**పెన్ పవర్ డెస్క్:** ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 11న రష్యా అధ్యక్షుడు పుతిన్ ( తో భేటీ కానున్నారు. ఈ నెల 12-13 తేదీలలో దిల్లీలో భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# విజయసాయి రెడ్డి రాజకీయ టార్గెట్ ఏంటి?

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మూడో ప్రత్యామ్నాయ శక్తిగా నిలవడానికి కొత్త పార్టీని స్థాపించి, ప్రజా సమస్యలపై పోరాడటమే ప్రస్తుత రాజకీయ టార్గెట్ అని విజయసాయి రెడ్డి చెబుతున్నారు. కానీ విజయసాయిరెడ్డి మీడియా సమావేశంలో చెప్పిన వ్యాఖ్యలు చూస్తే ఆయనకు ఒక దారి తెన్నూ లేనట్లే కనిపిస్తుంది. ఆయనతో కలసి వచ్చేదెవరు? విజయసాయి రెడ్డి కొత్త పార్టీ ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. అలాగే తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కానని, కేవలం తాను మెంటర్ ను మాత్రమేనని విజయసాయిరెడ్డి చెప్పారు. తనకు తాను మహారాష్ట్రలోని శివసేన అధినేత బాలథాక్రేతో పోల్చుకున్నారు. తాను ఒక మెంటర్ గానే ఉంటానని, అణగారిని వర్గాలకు మాత్రమే ముఖ్యమంత్రి పదవి దక్కుతుందని చెబుతున్నారు.

### నమ్మి వచ్చేదెవరు?

వైఎస్సార్‌సీపీకి దూరమైన ఆయన, ఆంధ్రప్రదేశ్ లో సొంతంగా ఒక కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ, టీడీపీ రెండు ప్రధాన పార్టీలకు వ్యతిరేకంగా రాజకీయాలు చేయాలని నిర్ణయించుకున్నారు.ధరల నియంత్రణ, రుణ విముక్తి వంటి అంశాలను తన అజెండాగా విజయసాయిరెడ్డి ప్రకటించారు. తాను మాత్రం ముఖ్యమంత్రి పదవి రేసులో లేనని, ప్రజల గొంతుకగా నిలవడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. అనుభవం, సమర్థులైన, నాయకత్వ పటిమ ఉన్న అణగారిన నేత ముఖ్యమంత్రి అభ్యర్థి అవుతారని విజయసాయిరెడ్డి చెప్పడానికి, వినడానికి బాగానే ఉంది. ఆయనను నమ్మి పార్టీలోకి వచ్చేదెవరు? ప్రస్తుతం ఏపీలో కూటమి, వైసీపీ బలంగా ఉంది. మూడో ప్రత్యామ్నాయానికి అవకాశమే లేదు.

### కాంగ్రెస్ కే దిక్కు లేనప్పుడు...

మూడో ప్రత్యామ్నాయానికి అవకాశం లేనప్పుడు, పొలిటికల్ వ్యాక్యూమ్ లేనప్పుడు విజయసాయిరెడ్డి పార్టీ పెట్టడం ఎందుకన్న ప్రశ్న కూడా తలెత్తుతుంది. అయితే జగన్ వర్గాన్ని టార్గెట్ చేయడానికే సాయిరెడ్డి పార్టీ పెడుతున్నట్లు అంచనాలు వినపడుతు న్నాయి. విజయసాయిరెడ్డి ఇప్పటి వరకూ నాయకుడిగా రాణించలేదు. కేవలం రాజ్యసభ సభ్యుడిగానే రెండుసార్లు అదీ జగన్ అవకాశం ఇచ్చినందునే ఆయనకు అవకాశం దక్కిం ది. అటువంటి సాయిరెడ్డిని నమ్మి రెడ్డి సామాజికవర్గం నేతలు కానీ, బలహీన వర్గాల నేతలు కానీ పార్టీలోకి వస్తారా? అన్న సందేహం అందరిలోనూ కలుగుతుంది. వైఎస్ షర్మిల నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీకే ఆంధ్రప్రదేశ్ లో దిక్కులేదు. ఇక విజయసాయిరెడ్డి వైపు దేకెదరు? అన్న కామెంట్స్ సోషల్ మీడియాలో బలంగా వినిపిస్తుంది. మరి సాయిరెడ్డి రాజకీయ వ్యూహం ఏంటో చూడాల్సిందే.

# సెప్టెంబరు 11న మోదీ-పుతిన్ భేటీ

- మొదటి పేజి తరువాయి

ఇరువురు దేశాధినేతలు ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. భారత్ తమకు వ్యూహాత్మక భాగస్వామి అని.. ఇరుదేశాల మధ్య భద్రత, అంతరిక్షం, ఇంధనం, రవాణా, సైన్స్ అండ్ టెక్నాలజీ సహా పలు రంగాలలో సహకారం విస్తరిస్తోందన్నారు.

ఇరుదేశాల నేతలు ద్వైపాక్షిక సమావేశం లో వాణిజ్యం, ఆర్థిక సంబంధాలకు పెద్దపీట వేయనున్నారని డిమిత్రి పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం, గల్ఫ్ ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం వంటి విషయాలపైనా చర్చలు జరిపే అవకాశం ఉందన్నారు. రష్యా–ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించడంలో భారత్ మధ్యవర్తిత్వం వహించడం తమకు అంగీకారమేనని తెలిపారు. యుద్ధాన్ని ముగించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఉక్రెయిన్‌తో చర్చలు తిరిగి ప్రారంభించడానికి అమెరికా చర్యలు తీసుకుంటోందన్నారు.

### బ్రిక్స్ ఇప్పుడు ఒక భారీ కూటమి..

బ్రిక్స్ కేవలం ఒక సాధారణ సంస్థ మాత్రమే కాదని..అదొక ప్రధాన ప్రపంచ కూటమి అని డిమిత్రి అభివర్ణించారు. ఈ కూటమి మరింత విస్తరించాలని రష్యా కోరుకుంటోందన్నారు. బ్రిక్స్ సమావేశాల్లో మరిన్ని దేశాలు పాల్గొంటే బాగుంటుందని.. ఇతర దేశాలను ఆహ్వానించడానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.

### భారత్‌తో అణు సహకారంపై దృష్టి..

రష్యా–భారత్ సహకారంలో అణు శక్తి ఒక కీలక రంగమని డిమిత్రి పేర్కొన్నారు. 'అణు రంగంలో రష్యా ప్రపంచ అగ్రగామిగా ఉంది. ప్రపంచంలోని అన్ని దేశాల కంటే మేమే ఎక్కువ అణు విద్యుత్ కేంద్రాలను నిర్మిస్తున్నాం. భారత్‌లో కుడంకుళం ప్రాజెక్ట్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. భారత్‌లో నిర్మించబోయే మరో కొత్త ప్లాంట్‌కు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి" అని పేర్కొన్నారు.

# నేడు కోనసీమ జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన..

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పాలనను పరుగులు పెట్టిస్తున్న ఆయన, ఈ పర్యటనలో భాగంగా పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా పి. గన్నవరం నియోజకవర్గంలో నిర్వహించే గ్రామసభలో పాల్గొని, లబ్ధిదారులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. ఈ పర్యటనలో రైతులతో ముఖాముఖి, గ్రామసభ, పార్టీ కేడర్‌తో సమావేశం వంటి కార్యక్రమాలు ఉన్నాయి. దశాబ్దాలుగా నలుగుతున్న గ్రౌండ్ రెంట్ భూముల సమస్య పరిష్కారానికి ఈ పర్యటనలో కీలక అడుగు పడనుంది.

### ముఖ్యమంత్రి పర్యటన పూర్తి షెడ్యూల్

ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ఈ విధంగా ఉంది. ఉదయం 9:45 గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచి బయలుదేరి, 10:30 గంటలకు అంబాజీపేట మండలం ఇరుసుమండ చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమవుతారు. అనంతరం 10:45 గంటలకు రోడ్డు మార్గంలో మాచవరం గ్రామంలోని జయంతి నగర్‌కు బయలుదేరతారు. ఉదయం 10:55 నుంచి 11:35 గంటల వరకు జయంతి నగర్‌లో ఏర్పాటు చేసిన 'రైతులతో ముఖాముఖి' కార్యక్రమంలో పాల్గొంటారు. రైతుల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా అడిగి తెలుసుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి 11:40 గంటలకు పండువారిపేటలోని గ్రామసభ వేదికకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1:55 గంటల వరకు 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేసి, భూ హక్కుల పరిరక్షణపై ప్రజలకు వివరిస్తారు. మధ్యాహ్నం 3:15 గంటలకు బుడుంగపేటలో జరిగే కేడర్ సమావేశంలో పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారు. సాయంత్రం 4:50 గంటలకు ఇరుసుమండ నుంచి తిరుగు ప్రయాణమై, 5:40 గంటలకు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయానికి చేరుకోవడంతో పర్యటన ముగుస్తుంది.

### గ్రౌండ్ రెంట్ భూములకు విముక్తి

కోనసీమ జిల్లాలో దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని గ్రౌండ్ రెంట్ భూముల సమస్యకు ఈ పర్యటనలో ముగింపు పలకనున్నారు. అమలాపురం, అంబాజీపేట, ముమ్మిడివరం, రామచంద్రాపురం ప్రాంతాల్లోని 56.37 ఎకరాల నివాస స్థలాలు పాత రెవెన్యూ రికార్డుల కారణంగా రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22–ఎ నిషేధిత జాబితాలో ఉన్నాయి. దీంతో 1,416 కుటుంబాలు తమ ఆస్తులపై హక్కులున్నా క్రయవిక్రయాలు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. క్షేత్రస్థాయి విచారణల అనంతరం, ఈ భూములను 22–ఎ జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నిర్ణయంతో 1,281 సర్వే నంబర్లకు సంబంధించిన సమస్యలు పరిష్కారమై, వేలాది మందికి ఉపశమనం కలగనుంది.

### 'మీ భూమి--మీ హక్కు'తో భరోసా

'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమాన్ని ప్రభుత్వం కేవలం పట్టాల పంపిణీగా కాకుండా, రైతు గౌరవాన్ని, పౌరుడి ఆస్తి హక్కును కాపాడే ఉద్యమంగా చూస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రీ–సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్ది, స్పష్టమైన భూ రికార్డులు అందించేందుకు 'రీ–సర్వే 2.0'ను అమలు చేస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 36 లక్షలకు పైగా పాస్‌పుస్తకాలు పంపిణీ చేయగా, వచ్చే మార్చి నాటికి రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 'నీరు జీవం... భూమి జీవితం' అనే నినాదంతో పంటకు నీటి భరోసాతో పాటు, ఆస్తికి హక్కు భరోసా కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడమే నిజమైన పాలన అని భావించే చంద్రబాబు, ఈ పర్యటన ద్వారా కోనసీమ వాసులకు భూ హక్కుల భరోసా కల్పించనున్నారు.

# చంద్రబాబు అరెస్ట్‌కు మూడేళ్లు..

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుకు నేటితో (సెప్టెంబర్ 9) మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 'నిజం గెలిచింది' పేరిట రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. చంద్రబాబును 53 రోజుల పాటు అక్రమంగా జైల్లో నిర్బంధించినందుకు నిరసనగా, ఆయన నిర్దోషిగా బయటకు వచ్చినందుకు గుర్తుగా పార్టీ కార్యాలయాలు, ఇళ్లు, బూత్ స్థాయిలో 53 దీపాలు వెలిగించి, ఆ రోజును 'బ్లాక్ డే'గా పాటించాలని ఆయన శ్రేణులకు సూచించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన లీడర్‌షిప్ కాంక్లేవ్ ముగింపు సభలో లోకేశ్ ఈ మేరకు కీలక ప్రకటన చేశారు.ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. కార్యకర్తల పోరాటాలు, త్యాగాల పునాదులపైనే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందని స్పష్టం చేశారు. "ఒక తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య, మంజుల వంటి కార్యకర్తలపై గత ప్రభుత్వం దాడులు చేసింది. కొందరిని హతమార్చింది. వారి త్యాగాల వల్లే మనం ఇవాళ నాయకులుగా ఉన్నాం. ఈ విషయాన్ని ఎవరూ మర్చిపోవద్దు" అని ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు. నాయకులకు శిక్షణ ఇచ్చేందుకు, ప్రజలకు మరింత చేరువయ్యే వ్యూహాలపై చర్చించేందుకు ప్రతి మూడు నెలలకోసారి ఇలాంటి కాంక్లేవ్‌లు నిర్వహిస్తామని తెలిపారు.

### నేతలకు 'త్రీ–పీ' మంత్రం

నాయకులంతా మూడు 'పీ'ల (పార్టీ, పర్సనల్, ప్రభుత్వం) సూత్రాన్ని తప్పక పాటించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. వ్యక్తిగతంగా (పర్సనల్) ప్రజలకు, కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండాలని, మానవత్వం, అణకువతో వ్యవహరించాలని హితవు పలికారు. "ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలి. ప్రధాని మోదీ గారి నుంచి నేను ఈ విషయం నేర్చుకున్నాను. ఆయన నా నుంచి కూడా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు. మనం కూడా విమర్శలను స్వీకరించి మార్పు చేసుకోవాలి" అని అన్నారు.రెండో 'పీ' అయిన పార్టీ విషయంలో కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాలని, అలకబూనిన వారిని దగ్గరకు తీసుకోవాలని సూచించారు. ఇక మూడో 'పీ' అయిన ప్రభుత్వం గురించి మాట్లాడుతూ.. నేతలు కేవలం పోస్ట్ ఆఫీసుల్లా కాకుండా, తమ నియోజకవర్గాల్లోని సమస్యల పరిష్కారానికి చొరవ చూపే లీడర్లలా వ్యవహరించాలని కోరారు. పాఠశాలలు, ఆసుపత్రులను తనిఖీ చేస్తూ ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించాలని ఆదేశించారు.

### వైసీపీ దుష్ప్రచారంపై ఐక్య పోరాటం

వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను ఐక్యంగా తిప్పికొట్టాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ రెడ్డి. డీఎస్సీపై మేం చిత్తశుద్ధితో 16 వేల పోస్టులు భర్తీ చేశాం. ఈ ఐదేళ్లలో 30 వేల పోస్టులు భర్తీ చేస్తాం. పోలీస్ నియామకాల్లోనూ అంతే. అయినా మనపైనే విమర్శలు చేస్తున్నారు. వాస్తవాలను ప్రజలకు వివరించాలి" అని అన్నారు. సొంత బాబాయి హత్య కేసు, లిక్కర్ స్కామ్ గురించి మాట్లాడని జగన్.. కేవలం డీఎస్సీపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు.ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వెర్షన్ అని, 'నో ఇగో, ఓన్లీ సర్వీస్' అనే నినాదంతో పనిచేయాలని లోకేశ్ స్పష్టం చేశారు. "పార్టీ నిర్ణయం తీసుకున్నాక అందరూ కట్టుబడి ఉండాలి. అహంకారం వద్దు, కలిసికట్టుగా రాష్ట్రాన్ని, పార్టీని నడిపిద్దాం" అని ఆయన ముగించారు. తన ఎదుగుదలకు కారణం కార్యకర్తల సహకారమేనని లోకేశ్ పేర్కొన్నారు.

## అసెంబ్లీ ఆవరణలో కుప్పకూలిన ఐఏఎస్ నవీన్ మిట్టల్ పర్సనల్ సెక్రటరీ రాజు మృతి

- మొదటి పేజి తరువాయి

ఉదయం అసెంబ్లీ ఆవరణలో అకస్మాత్తుగా కుప్పకూలారు. రాజు కుప్పకూలడాన్ని గమనించిన మంత్రి వాకిటి శ్రీహరి వెంటనే స్పందించి ఆయనకు సీపీఆర్ చేశారు.అనంతరం చికిత్స నిమిత్తం రాజును ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. అసెంబ్లీ ఆవరణలోనే రాజు మృతి చెందడంతో అక్కడ విషాద వాతావరణం నెలకొంది. రాజు మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# ఎల్‌నినో.. తాగునీటికే మొదటి ప్రాధాన్యం

అమరావతి: ఎల్‌నినో వల్ల ఏపీపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 54శాతం లోటు వర్షపాతం నమోదైందని, జలాశయాల్లో గతేడాది 737 టీఎంసీల నీరు ఉంటే.. ఈసారి 530 టీఎంసీలే ఉందని తెలిపారు. ఎల్‌నినోపై జరిగిన చర్చలో నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గుతున్నాయని అన్నారు. "నెల్లూరు, తిరుపతి, కోనసీమ జిల్లాల్లో వేయాల్సిన దానికన్నా ఎక్కువగా పంటలు వేశారు. మార్కాపురం, పోలవరం, ప్రకాశం జిల్లాల్లో 12శాతం పంటలే వేశారు. ఉద్యాన పంటలు కూడా పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. సంక్షోభం దృష్ట్యా తాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇస్తాం. బోర్లు ఎండిపోయిన చోట తాగునీటి కొరత లేకుండా చూడాలి. ప్రతి ఎకరాన్నీ పీఎండీఎస్ విధానంలో సాగు చేసేలా చూడాలి. 32 రకాల విత్తనాలను పీఎండీఎస్ ద్వారా సాగు చేసేందుకు అవకాశం ఉంది. సాగునీటి ప్రాజెక్టులకు మా ప్రభుత్వమే ఎక్కువ ఖర్చు చేసింది. ఉచిత ఇసుక.. ఇతర రాష్ట్రాలకు వెళ్తే అడ్డుకోవాలి. ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకొని ఉచిత ఇసుక ఇస్తున్నాం. వైకాపా పాలనలో జే బ్రాండ్ల వల్ల 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. మద్యాన్ని ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించేందుకు వీల్లేదు. గొడ్డలి పార్టీ నేతల దుష్ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దు. టీచర్లను బెదిరించే స్థాయికి గొడ్డలి పార్టీ మీడియా దారుణాలకు ఒడిగట్టింది. ఇలా బరితెగించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించ కూడదు" అని చంద్రబాబు అన్నారు.

## తెలంగాణ పోలీసు ఉద్యోగ అభ్యర్థులకు గుడ్ న్యూస్..

# దరఖాస్తు గడువు పెంపు

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ) కీలక ప్రకటన చేసింది. కానిస్టేబుల్ స్థాయి పోస్టుల దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు బోర్డు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 9వ తేదీతో ఈ గడువు ముగియాల్సి ఉండగా, అభ్యర్థుల సౌకర్యార్థం సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించింది.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,437 పోస్టుల భర్తీ కోసం టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ జూలై 29న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో సివిల్ కానిస్టేబుల్ (3,697), ఏఆర్ కానిస్టేబుల్ (1,052), స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ (1,380), ఫైర్ ఫైటర్ (751), జైల్ వార్డర్ (208), ఎస్ఏఆర్ సీపీఎల్ (24) పోస్టులు ఉన్నాయి.

ఈ ఉద్యోగల కోసం ఇప్పటివరకు 3,38,336 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారిలో 2,88,530 మంది ఫీజు చెల్లించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేశారు. ఆధార్ వెరిఫికేషన్ సైతం 95 శాతానికి పైగా పూర్తయినట్లు బోర్డు తెలిపింది. గడువు

ముగిసే ఆఖరి రోజుల్లో దరఖాస్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని బోర్డు పేర్కొంది. కాబట్టి అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

# నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

- మొదటి పేజి తరువాయి

తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు.ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. "ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు.ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి.వడోదరా ద

మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

# తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో సంచలన తీర్పు.. దోషికి ఉరిశిక్ష

మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఒక దోషికి మరణశిక్ష విధిస్తూ, మరో ఇద్దరికి కఠిన కారాగార శిక్షలను ఖరారు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.వివరాల్లోకి వెళితే, 2022లో తిరునల్వేలికి చెందిన 16 ఏళ్ల బాలికకు ఓ ప్రార్థనా స్థలంలో విలాతికులానికి చెందిన పెయింటర్ మునీశ్వరన్ (25) పరిచయమయ్యాడు. ఫోన్ నంబర్లు మార్చుకున్నాక వారిద్దరూ సుమారు రెండు వారాల పాటు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన మునీశ్వరన్, సదరు బాలికను తన ద్విచక్ర వాహనంపై మీనాక్షిపురంలోని తన సోదరి నివాసానికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం మునీశ్వరన్ తన స్నేహితులైన చిన్నకుట్టి (28), మురుగేశన్ (23)లను అక్కడికి పిలిపించాడు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, వారు కూడా బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టారు. ఈ దారుణం గురించి బాధితురాలు తన తల్లిదండ్రులకు తెలపడంతో, వారు పాళయంకోట్టై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.

ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సురేశ్ కుమార్ మంగళవారం తుది తీర్పు వెలువరించారు. నిందితుడు చిన్నకుట్టికి మరణశిక్ష విధించగా, మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది

## వైసీపీ నుంచి టీడీపీలోకి

# ఇంకా వస్తారు

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మంగళవారం ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. వైసీపీ నుంచి ఇంకా చాలామంది నేతలు టీడీపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని, త్వరలోనే మరిన్ని చేరికలు ఉంటాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నాడు అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో చిన్న శ్రీను, ఆయన కుమార్తె సిరి సహస్ర టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు బేబినాయన, అదితి గజపతిరాజు, కళా వెంకట్రావు వంటి పలువురు ఉత్తరాంధ్రకు చెందిన సీనియర్ నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత రెండేళ్లుగా అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల్లా పరుగుపెడుతున్నాయని అన్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, విజయనగరం జిల్లా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకునే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతూ ఏపీని ప్రథమ స్థానంలో నిలబెట్టే వారి ప్రయత్నంలో నేను కూడా భాగస్వామిని కావాలనుకుంటున్నాను. ఈ అభివృద్ధి యజ్ఞంలో పాలుపంచుకోవాలనే తపనతోనే టీడీపీలో చేరాను" అని వివరించారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ముందు జగన్‌కు స్వాగతం పలికిన మీరు, ఇంత సడన్‌గా పార్టీ మారడానికి కారణమేమిటని విలేకరులు ప్రశ్నించగా.. గత రెండేళ్లుగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగం కావాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని బదులిచ్చారు. "వైసీపీ నుంచి ఇంకా ఎవరైనా వస్తారా?" అన్న ప్రశ్నకు, "ఇంకా వస్తారు.. చాలామంది వస్తారు" అని ఆయన నొక్కి చెప్పడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లాకు వెళ్లాక మరిన్ని విషయాలు పూర్తిస్థాయిలో వెల్లడిస్తానని తెలిపారు.

# గంజాయి, నాటు సారా జోలికి పోవద్దు



- రోడ్డు భద్రతా, బాల్యవివాహాల నివారణ, మహిళల రక్షణ మరియు పోక్సోచట్టంపై అవగాహన.
- ముంచంగిపుట్టు ఎస్ఐ పి నాని.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 08.** గంజాయి, నాటుసారా వల్ల కలిగే దుష్పరిణామాలపై మండలంలో గల వనుగుమ్మ పంచాయితీ కేంద్రంతోపాటు, దోడిపుట్టు గ్రామంలో పోలీస్ అవగాహన కార్యక్రమ ర్యాలీ మరియు మానవహారం నిర్వహించినట్లు ముంచంగిపుట్టు ఎస్సై పీ నాని తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆయా గ్రామాల్లో పోలీస్ సిబ్బంది మరియు ఏపీఎస్పీ బలగాలతో కలిసి ప్రజా అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్రజలు గంజాయి, నాటు సారా జోలికి పోవద్దని, రోడ్డు భద్రతా నిబంధనలు, బాల్యవివాహాల నివారణ, మహిళల రక్షణ మరియు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. అలాగే ఆన్‌లైన్ మోసాల నివారణకు 1930 సైబర్ హెల్ప్‌లైన్ వినియోగంపై మరియు పోలీస్ సేవలపై వచ్చే ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా అభిప్రాయాలు తెలియజేయడంపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టు పోలీస్ సిబ్బంది, ఏపీఎస్పీ బలగాలు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

## ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా



## పెన్షన్ లబ్ధిదారులకు అండగా జనసేన

### అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా జనసేన కృషి

### 92వ వార్డు వెంకటాపురంలో న్యూ పెన్షన్ స్కీం పెన్షనర్లకు సేవలు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 8 :** జనసేన పార్టీ ఆధ్వర్యంలో 92వ వార్డు వెంకటాపురం మూడు గుళ్ల సమీపంలో న్యూ పెన్షన్ స్కీం పెన్షనర్లకు సేవలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ధవళ గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు ముఖ్యఅతిథిగా హాజరై పెన్షన్ లబ్ధిదారులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా బెహరా భాస్కరరావు మాట్లాడుతూ.. వార్డులో పెన్షన్‌కు అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం అందించే పెన్షన్ సకాలంలో అందేలా జనసేన పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ పెన్షన్ కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కార్యకర్తలకు సూచించారు. పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు అవసరమైన సమాచారం అందించడంతో పాటు, దరఖాస్తు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు కార్యకర్తలు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. అర్హత ఉన్న ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకానికి దూరం కాకుండా ప్రతి కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం పనిచేస్తోందని భాస్కరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధవళ మోహన్, కంపర కోటీశ్వరరావు, నరేష్, గొంతిన శ్రీనివాసరావు, ధవళ మారయ్య, పాల బాబురావు, ఇల్లపు సురేష్, మనోహర్, బోడి రాంబాబు, త్రినాథ్, తుంపాల బాబురావు, రాము మాస్టర్, గణేష్, ధవళ రాంబాబు, గొంతిన నాగరాజు, పీతల అప్పలరాజు, దాలిబోయిన శంకర్రావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, మామిడి రామకృష్ణ, బలిజ అప్పలనాయుడు, రామారావు, అట్టా శంకర్ రమణ, రమేష్ రెడ్డి, అక్కిరెడ్డి నాగరాజు, అభిరామ్, గొంతిన జగదీష్, నానాజీ, గొంతిన బాబు, గొంతిన కృష్ణ, కంద గణేష్, గంట్ల గణేష్, ఇల్లపు శ్రీను, చింతల శ్రీను, ఇల్లపు కన్నారావు, కంపర రమణ, కంపర శంకర్రావు, దాసరి జ్యోతి, బల్ల రమణ, కరణం కన్నారావు, చిన్ని దివాకర్ తదితర జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యం.. ఐక్యంగా ముందుకు సాగాలి





## పెందుర్తిలో వైసీపీ విస్తృతస్థాయి సమావేశం

**పెందుర్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 8 :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యతను పెంపొందించి సమన్వయంతో ముందుకు సాగాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. పెందుర్తి నియోజకవర్గం రాంపురంలోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశానికి ముందు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాంపురంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం జరిగింది. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డే ప్రసాద్, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి, పెందుర్తి పరిశీలకులు చిక్కాల రామారావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో వైసీపీని మరింత పటిష్టం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజల్లో పార్టీపై విశ్వాసాన్ని పెంచే విధంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమావేశంలో నాయకులు చర్చించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, పరస్పర సహకారం, ఐక్యత పార్టీ బలోపేతానికి కీలకమని పేర్కొన్నారు. వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా పార్టీ ప్రయోజనాలను ముందుంచి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన పలు హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కాలం గడుస్తున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరుగుతోందని విమర్శించారు. 'సూపర్ సిక్స్' హామీల్లో భాగంగా 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీ అమలు విషయంలో ప్రజలకు స్పష్టత లేదని అన్నారు. రైతులకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించినప్పటికీ అది పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ప్రకటించినప్పటికీ అర్హతలు, ఇతర నిబంధనల కారణంగా పలువురు లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందడం లేదని పేర్కొన్నారు. 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామని ఇచ్చిన హామీ అమలు పరిస్థితిపై కూడా అదీప్‌రాజ్ ప్రశ్నించారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, ఆ హామీ అమలు కూడా జరగలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా వివరించి, వాటి అమలుపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అత్యంత విలువైన రాజ్యాంగాల్లో ఒకటని పేర్కొన్నారు. రాజ్యాంగం గొప్పగా ఉన్నప్పటికీ దాని స్ఫూర్తిని అమలు చేసే వ్యవస్థల్లో నిజాయితీ, నిబద్ధత ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సామాన్య ప్రజలకు సకాలంలో న్యాయం అందడంతో పాటు అట్టడుగు వర్గాలకు సంక్షేమం, భద్రత అందేలా పాలనా వ్యవస్థలు పనిచేయాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో పాలకులపై విమర్శలు చేయడం మాత్రమే కాకుండా ఓటర్లుగా ప్రజలు కూడా తమ బాధ్యతను గుర్తించాలని సూచించారు. కులం, మతం, డబ్బు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రజాసేవ, నిజాయితీ, అభివృద్ధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకోవాలని అమర్నాథ్ అన్నారు. ప్రజాస్వామ్యం మరింత బలోపేతం కావాలంటే ప్రజల్లో రాజకీయ, రాజ్యాంగపరమైన చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలపై ప్రజలతో కలిసి పనిచేస్తేనే రాజకీయ పార్టీలు బలపడతాయని పేర్కొన్నారు. రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా అమర్నాథ్ ప్రస్తావించారు. రైతుల సంక్షేమం విషయంలో ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రైతుల సమస్యలపై తాము స్పందించిన తీరును ఆయన గుర్తుచేశారు. రైతుల కుటుంబాలకు అండగా నిలవడం, ప్రజా సమస్యలపై పోరాటం చేయడం పార్టీ శ్రేణుల బాధ్యతగా పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని నాయకులు కార్యకర్తలకు సూచించారు. వైసీపీ తిరిగి ప్రజల విశ్వాసాన్ని పొందేందుకు పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. గ్రామ, వార్డు, బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయడంతో పాటు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిపై పోరాటాలు నిర్వహించాలని సూచించారు. పార్టీ నాయకత్వం నిర్దేశించే కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయం పెంచుకోవాలని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత చురుగ్గా స్పందిస్తూ వైసీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని నాయకులు తెలిపారు. ఈ సమావేశం ద్వారా పెందుర్తి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులకు భవిష్యత్ కార్యాచరణపై నాయకత్వం దిశానిర్దేశం చేసింది.

## శాంతి యుత నిరసన పోరాటం కొనసాగిస్తాం

### వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు




**జి.మాడుగుల.పెన్ పవర్.సెప్టెంబర్ (8)** ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ లో ఏళ్ళతరబడి పనిచేస్తున్నా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయ్యాలని రెగ్యులర్ చేసేవరకు 100% గ్రాస్ శాలరీ ఇవ్వాలని విధినిర్వణలో చనిపోయిన కాంట్రాక్టు ఉద్యోగులకు 50లక్షలుఎక్స్ గ్రేసియా ఇవ్వాలి కాంట్రాక్టు ఉద్యోగ కుటుంబనికి ఉద్యోగ అవకాశంకల్పించాలి
కాంట్రాక్టు ఉద్యోగులకు ఈ.పి.ఎఫ్ కల్పించాలి
అనారోగ్యనికి గురైయినా ఉద్యోగులకు పూర్తిజీతంతో సెలవులు మంజూరు చేసి వారికుటుంబలకుహెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలి
కోవిడ్ సమయంలో ప్రాణాలు పాణంగా పెట్టి డ్యూటీలు చేసిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసిమమ్మలి గుర్తించండిఅని స్టేట్ వైజ్ చేస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల శాంతి యుత నిరసన కార్యక్రమంలో భాగంగా ఈరోజు జి. మాడుగుల పీహెచ్సి లో వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగులు మనవహారంగా శాంతి యుత నిరసన తెలిపారు ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఎండ్ హెల్త్ సర్విసెస్ అసోసియేషన్ అల్లూరి సీతరామరాజు జిల్లా పాడేరు అధ్యక్షులు
చీ. ప్రకాష్ రావు. మరియు ఆశాకార్యకర్తలు. సి హెచ్ డబ్ల్యూ పాల్గోని కాంట్రాక్టు ఉద్యోగులకు సంపూర్ణ మద్దత్తు తెలిపారు కాంట్రాక్టు ఉద్యోగుల యూనియన్ ప్రధాన కార్యదర్శి, వా. బాలయ్య ఖ. శంకర్ రావు వాదిూ.దేవి,ఖ.నాగమణి, వా.ఖ.లాలు ఎ. కొత్తందొర,పాల్గోవడంజరిగింది,

## అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా జనసేన కృషి



## చంద్రనగర్‌లో న్యూ పెన్షన్ స్కీం లబ్ధిదారులకు సేవలు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 8 :** పెన్షన్‌కు అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకం ద్వారా పెన్షన్ అందేలా జనసేన పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు పిలుపునిచ్చారు. అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాలతో పెన్షన్ అందని వారికి అవసరమైన సహకారం అందించి, వారి దరఖాస్తుల ప్రక్రియలో అండగా నిలవాలని ఆయన సూచించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో 89వ వార్డు చంద్రనగర్ రామాలయం వద్ద గేదెల మురళీకృష్ణ ఆధ్వర్యంలో న్యూ పెన్షన్ స్కీం పెన్షనర్లకు సేవలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు హాజరై లబ్ధిదారులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా బెహరా భాస్కరరావు మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు నిరంతరం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హత కలిగిన లబ్ధిదారులు పెన్షన్ కోసం ఇబ్బందులు పడకుండా వారికి అవసరమైన సమాచారం, సహాయ సహకారాలు అందించాలని సూచించారు. "వార్డులో పెన్షన్‌కు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా జనసేన పార్టీ కృషి చేస్తుంది. ఒక్క అర్హుడూ సంక్షేమ పథకానికి దూరం కాకుండా ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలి" అని ఆయన అన్నారు. లబ్ధిదారుల నుంచి వచ్చిన సందేహాలను అడిగి తెలుసుకున్న నాయకులు, దరఖాస్తుల ప్రక్రియ, అవసరమైన వివరాలు, సంబంధిత సేవలపై వారికి అవగాహన కల్పించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో 73వ వార్డు అధ్యక్షులు పెతకం శెట్టి శ్యాంసుందర్, తుంపాల బాబురావు, కప్పరాడ సంతోష్, లంకి అప్పలరాజు, నరేష్, వెలంపూడి వెంకట బాలకృష్ణ, కొట్యాడ సంతోష్, జగన్ పాత్రుడు, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, గని, శివ, గౌరీ, బుల్లి, ఆనంద్, రామకృష్ణ, కూర్మ తదితర జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.



### న్యూ పెన్షన్ స్కీం దరఖాస్తుదారులకు సేవలు బెహరా భాస్కరరావు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 8 :** జీవీఎంసీ 91వ వార్డులో పెన్షన్‌కు అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం అందించే పెన్షన్ ప్రయోజనం చేరేలా జనసేన పార్టీ కృషి చేస్తుందని జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు అన్నారు. గోపాలపట్నం మెయిన్ రోడ్డులోని స్టేట్ బ్యాంక్ సమీపంలో గునిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో న్యూ పెన్షన్ స్కీం లబ్ధిదారులకు సేవలు అందిస్తున్న కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పరిశీలించారు. ఈ సందర్భంగా బెహరా భాస్కరరావు మాట్లాడుతూ.. పెన్షన్‌కు అర్హత కలిగిన ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకం నుంచి దూరం కాకుండా కార్యకర్తలు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు దరఖాస్తు ప్రక్రియ, అవసరమైన వివరాల సమర్పణ తదితర అంశాల్లో సహకారం అందించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వార్డులో పెన్షన్‌కు అర్హత ఉన్న ప్రతి ఒక్కరిని గుర్తించి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ పెన్షన్ మంజూరయ్యే వరకు కార్యకర్తలు అండగా నిలవాలని ఆయన అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి జనసేన నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 91వ వార్డు అధ్యక్షులు నరేంద్ర, బురెడ్డి గోపి, కంపర కోటేశ్వరరావు, ఉండ్రాళ్ల ప్రకాష్, కడిమి రామకృష్ణ, అప్పలరాజు, నరేష్, గోల్కొండ శ్రీనివాసరావు, సురేష్, రామకృష్ణ, సాగర్, షేక్ వల్లి, పోతు మహంతి లక్ష్మి, భారతి, రోజారాణితో పాటు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

- 51 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేత.
- మండల రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ భూపతి.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 08.** మండలంలో గల కుమడ పంచాయతీ మద్దులబంధ గ్రామంలో మంగళవారం రీ సర్వే డిటి భూపతి ఆధ్వర్యంలో 51 మంది రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భూపతి మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారిక రాజముద్రతో, అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తోందన్నారు. గతంలో ఉన్న పాస్ పుస్తకాల స్థానంలో ప్రభుత్వ అధికారిక రాజముద్రతో బ్లూ కలర్ డిజైన్‌తో వీటిని ముద్రించారని, అక్రమాలను అరికట్టడానికి మరియు తప్పులు లేకుండా ఉండేందుకు వీటిలో అత్యాధునిక భద్రతా ఫీచర్లను చేర్చారన్నారు. గతంలో గ్రామంలో రీ సర్వే నిర్వహించామని, దీంతో నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ మఠం ముక్తమ్మ, టిడిపి నాయకులు పాంగి శాస్త్రి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం

- గ్రామంలో నీటి సరఫరా చేసే ప్రధాన నీటి వనరును మరమ్మతులు చేపట్టాలి.
- నెల రోజుల నుంచి నీటి సమస్యతో బాధపడుతున్న గ్రామస్తులు.
- గుత్తేదారుని నిర్లక్ష్యమే నీటి సమస్యకు కారణం అంటున్న టిడిపి నేత రఘునాథ్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 08.** అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలంలో గల మాకవరం పంచాయతీ, కుంభీరిపడ గ్రామంలో నెలరోజుల పాటు తీవ్ర నీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నీటి సమస్య పరిష్కారానికి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టీ నిశాంతికు సోమవారం వినతి పత్రాన్ని సమర్పించినట్లు టిడిపి మండల ఎస్టీ సెల్ కార్యదర్శి గొల్లోరి రఘునాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ప్రధాన నీటి వనరుగా ఉన్న బోరు బావిలో మోటరు, ప్యానల్ బోర్డ్ మరమ్మతులకు గురవడం వల్ల గ్రామంలో నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. చేసేది లేక గ్రామస్తులు ఊట గెడ్డల మీద ఆధారపడాల్సి వస్తుందని, వర్షం పడితే బురద నీళ్లను సేకరించి తప్పని పరిస్థితుల్లో ఉపయోగించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో బోరుబావి నుంచి నీటిని సరఫరా చేయుటకు వెంటనే వాటర్ మోటర్, ప్యానెల్ బోర్డు మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశామన్నారు. గతంలో జేజేఎం వర్క్ పనులు చేపట్టిన సదరు గుత్తేదారుడు గ్రామంలో నీటి సౌకర్యం కల్పనకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, సమస్య పరిష్కారానికి కాంట్రాక్టర్ చొరవ చూపాలని అన్నారు. కాగా గ్రామంలో నీటి పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు రఘునాథ్ పేర్కొన్నారు.

## విద్యార్థుల్లో అటవీ సంరక్షణపై అవగాహన

జీటీవీడబ్ల్యూప పాఠశాలలో 'ఏఎస్ఆర్ అరణ్య' కార్యక్రమం




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** విద్యార్థుల్లో అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ఆర్.వి. నగర్ అటవీ రేంజ్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్.వి. నగర్‌లోని జీటీవీడబ్ల్యూఏ పాఠశాలలో 'ఏఎస్ఆర్ అరణ్య' కార్యక్రమాన్ని నిర్వహించారు. అటవీ రేంజ్ అధికారి కె. మణికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యత, అటవీ సంరక్షణ, వన్యప్రాణుల పరిరక్షణ, అటవీ చట్టాలు, సహజ వనరుల సంరక్షణపై అవగాహన కల్పించారు. అటవీ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అవగాహన వీడియోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించగా 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే అడవులు, వన్యప్రాణులు, ప్రకృతి వనరుల పరిరక్షణపై బాధ్యతతో వ్యవహరించాలని అటవీ రేంజ్ అధికారి కె. మణికృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూకరాజు, పాఠశాల సిబ్బంది, డీఆర్‌వో కృష్ణారావు, ఎఫ్ఎస్‌వో మహేష్ గిరి, పుష్ప, ఎఫ్‌బీవోలు భూషణం, నవీన్, భద్రం, బేస్ క్యాంప్ సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# గుత్తేదారుని నిర్లక్ష్యంపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తా

- వలజంగి నుంచి దానబందు రోడ్డు నిర్మాణాన్ని పట్టించుకోని అధికారులు.
- రెండు కోట్ల 20 లక్షల నిధులతో చేపట్టిన ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ రోడ్డుకు మోక్షం ఎప్పుడు?
- అసంపూర్తితో నిలిచిపోయిన దానబోందు, వలజంగీ రోడ్డు.
- తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించాలన్న వైస్ ఎంపీపీ సిర్గం భాగ్యవతి.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 08.** గుత్తేదారుని నిర్లక్ష్యంతో అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలంలోనీ అత్యంత మారుమూల రంగబయలు పంచాయితీ, దానబందు గ్రామరోడ్డు నిలిచి పోయాయన్నారు. గతంలో నత్త నడకన కొద్దిపాటి రోడ్డు నిర్మాణ పనులు కొనసాగాయని, నిలిపివేసిన పనులు త్వరగా ప్రారంభించకుంటే దీనిపై అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానని ముంచంగిపుట్టు మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలు సిర్గం భాగ్యవతి అన్నారు. మంగళవారం నిర్మాణంలో ఉన్న రహదారులను పరిశీలించిన అనంతరం భాగ్యవతి మాట్లాడుతూ.. 2025-26 సంవత్సరంలో ఎంజి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రెండు కోట్ల 20 లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, నత నడకన రోడ్డు పనులు చేస్తూ అసంపూర్తిగా విడిచిపెట్టారని బాగ్యవతి మండిపడ్డారు. దానబందు గ్రామస్తులు రోడ్డు పనుల పరిశీలనకు పిలిచారని, దీంతో గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నానన్నారు. రెండు కోట్ల 20 లక్షల ఉపాధి హామీ నిధులతో పనులు ప్రారంభించిన సదరు కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా నతనడకన పనులు చేస్తుండడంతో రోడ్డు పూర్తి కాక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధించిన శాఖ అధికారులు దృష్టి సారించక పోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. రహదారిలేక బడి పిల్లలు వాగులు దాటి రెండు కిలో మీటర్ల మేర ప్రతిరోజు బడికి వెళ్లి రాకపోకలు సాగిస్తున్నారనీ తెలిపారు. గ్రామంలో ఎవరికైనా అనారోగ్యం గురై ఆసుపత్రికి వెళ్లాలన్న, మండల కేంద్రానికి వెళ్లాలన్నా, పాఠశాల విద్యార్థులు బడికి వెళ్లాలన్న వర్షాకాలంలో ప్రమాదకరమైన వాగు దాటక తప్పట్లేదు అన్నారు. గ్రామస్తుల సమస్య విన్న భాగ్యవతి సంబంధిత ఇంజనీరింగ్ అధికారికి ఫోన్ ద్వారా రోడ్డు పనులు ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా సదరు కాంట్రాక్టర్ చేస్తున్నారని ప్రశ్నించగా త్వరలో పనులు ప్రారంభించేందుకు గుత్తేదారునితో మాట్లాడుతానని ఇంజనీర్ అధికారి సమాధానం ఇచ్చినట్లు ఆమె తెలిపారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించక పోతే జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని సంబంధిత ఇంజనీరింగ్ అధికారికి ఫోన్ ద్వారా మాట్లాడారు. రెండు కోట్ల 20 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తే సదరు కాంట్రాక్టర్ ఎక్కడ పనులు అక్కడ నిలిపివేసి అసంపూర్తిగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆమె మండిపడ్డారు.

## విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి పరిశోధనా తత్వాన్ని వెలికితీయాలి.

- విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకూడదు.
- సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం అవసరం.




**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 8.** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, సృజనాత్మకత, పరిశోధనా సామర్థ్యాలను వెలికితీయాలని జిల్లా సైన్స్ అధికారి కేజే రామారావు అన్నారు. మంగళవారం స్థానిక గిరిజన బాలికోన్నత పాఠశాల బాలురు2లో విద్యార్థులకు పరిశోధనా సామర్థ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా కొత్త విషయాలను అన్వేషిస్తూ సొంతంగా ఆలోచించే విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే వినూత్న ఆలోచనలు, ప్రయోగాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.
ఈ ఏడాది నిర్వహించనున్న ఇన్‌స్పైర్ మానక్ అవార్డులకు అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు నమోదు చేసుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోర్సు డైరెక్టర్ సాగిన రామరాజు పడాల్ కోరారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారి ఆలోచనలను ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇన్‌స్పైర్ మానక్ ద్వారా విద్యార్థులకు తమ సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించేందుకు మంచి వేదిక లభిస్తుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రోత్సహించి, వారి కొత్త ఆలోచనలకు సహకరించాలని కోరారు. జిల్లా స్థాయి ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న శేషామాంబ, వై.శారమ్మలను సైన్స్ ఉపాధ్యాయులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు కిల్లంగి ప్రసాద్‌రావు, పి.చిన్ని బాబు, శంకర్‌బాబు, పలువురు సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రేషన్ దారులకు తూకంలో తేడా వద్దు

- లబ్ధిదారులకు రెండు మూడు కేజీలు తక్కువ బియ్యం అందుతున్నట్లు ఆరోపణ.
- లబ్ధిదారులకు నిర్ణీత పరిమాణంలో బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలి.
- సిపిఎం నాయకులు జీ జీనబంధు, జి నారాయణ.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 08.** మండలంలోని క్రిరీ ముఖిపుట్టు పంచాయితీ డిఆర్ డిపోలో గత నాలుగు నెలల నుంచి రేషన్ బియ్యం తగ్గుతున్నాయని సిపిఎం పార్టీ దృష్టికి వచ్చిందని దీంతో మంగళవారం తూకం వేయటం జరిగిందనీ సిపిఎం నాయకులు జీ జీనబంధు జి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలిపిన వివరాలు ప్రకారం.. రేషన్ లబ్ధిదారులు చెప్పిన ప్రకారమే కొందరికి 35 కిలోల బియ్యం రావాల్సి ఉండగా కొంతమంది లబ్ధిదారులకు తక్కువ బియ్యం అందుతున్నట్లు తెలిసిందని, 25 కేజీలు ఉన్నవారికి 22, 23 కేజీలు అందుతున్నట్లు గుర్తించమన్నారు. గోనె సంచితో తూకం వేస్తే 600 గ్రాములు తగ్గుతుందనీ, కాబట్టి లబ్ధిదారులు తెచ్చిన సంచిలోనే రేషన్ ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై సేల్స్ మెన్ కు విన్నవించడం జరిగిందనీ, ఇక నుంచి అలా జరగకుండా చూస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు సిపిఎం నాయకులు పేర్కొన్నారు. కాగా జరిగిన విషయంపై సదరు సేల్స్ మెన్ కు పాత్రికేయులు వివరణ కోరగా ప్రభుత్వం అందిస్తున్న బియ్యం సంచిలోనే రేషన్ ఇస్తున్నామని, అంత పెద్ద మొత్తంలో తేడా ఏమీ లేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్ పరమేష్, వి వెంకట్రావు, జీ రామారావు రేషన్ కార్డు లబ్ధిదారులు పాల్గొన్నారు

## గిరిజన కళాకారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు ప్రారంభం



**అరకులోయ పెన్ పవర్ సెప్టెంబర్ 8 :** గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణా మిషన్ (గిరిజన సంక్షేమ శాఖ, విశాఖపట్నం) మరియు ఐటిడిఎ (పాడేరు) సంయుక్త ఆధ్వర్యంలో, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ (న్యూఢిల్లీ) సహకారంతో గిరిజన కళాకారులకు ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు సెప్టెంబర్ 07వ తేది. నుండి 12 వ తేది వరకుజరగనున్న శిక్షణ కార్యక్రమలు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ అరకువ్యాలీలో ట్రైబల్ మ్యూజియం, మాడగడ, ముసిరిగూడ లో కార్యక్రమాన్ని మిషన్ డైరెక్టర్ డా. మందా రాణి అధికారికంగా ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులను మూడు వేర్వేరు ప్రాంతాలలో నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. అరకు గిరిజన మ్యూజియంలో లక్క బొమ్మలు, హస్తకళలు, గాజుల తయారీ, బుద్ధ సాంప్రదాయ కళలు, సవర ఆర్ట్ శిక్షణ ప్రారంభం, అలాగే మాడగడ గ్రామంలో టెర్రకోట ఆర్ట్ (కుండలు మరియు వివిధ మట్టి కళాకృతుల తయారీ) శిక్షణ, ముసిరిగూడ గ్రామంలో వెదురు (బ్యాంబూ)హస్తకళాకృతుల తయారీ శిక్షణ, కళాకారులకు నాణ్యమైన శిక్షణ అందించేందుకు ఇతర రాష్ట్రాల నుండి నిపుణులను రప్పించామని ఛత్తీస్‌గఢ్ నుండి వెదురు క్రాఫ్ట్, ఒడిశా నుండి టెర్రకోట పాటరీ, రాజస్థాన్ నుండి వచ్చిన వారు లక్క ఆర్ట్ నిష్ణాతులు వారు స్థానిక గిరిజన కళాకారులకు ప్రత్యక్ష శిక్షణ ఇస్తున్నారని వివరించారు . ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు డా" నాగరాజు చిక్కాల (ప్రొఫెసర్), శ్రీ కాట్రగడ్డ శ్రీనివాస వరప్రసాద్ (అసోసియేట్ ప్రొఫెసర్)లతో పాటు శ్రీ చీ. మురళి కృష్ణ ప్రసాద్, +. గణపతి నాయుడు, పిచ్చయ్య నాయుడు మరియు అరకు గిరిజన మ్యూజియం సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడు కామేశ్వరరావుకు ఘన సత్కారం



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఉపాధ్యాయుడు గెమ్మెలి కామేశ్వరరావు సేవలు అభినందనీయమని పెసా కమిటీ కార్యదర్శి మాదిరి చంటిబాబు అన్నారు. ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికై పురస్కారం అందుకున్న కామేశ్వరరావును మంగళవారం దామనాపల్లి పంచాయతీ పరిధిలోని సిగినాపల్లి ఎస్.ఆర్.నగర్ కాలనీ పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చే విధంగా కామేశ్వరరావు అందిస్తున్న సేవలను పలువురు కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాగిన బాలరాజు, జనసేన పార్టీ నాయకుడు వంతల సింగిరాజు, పెసా కమిటీ కార్యదర్శి రాధ కృష్ణ, గ్రామస్తులు సంకోజీ నాగేశ్వరావు,సాగిన లక్ష్మణరావు, సంకోజీ చంటిబాబు, సంకోజీ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## జగన్ హయాంలో ఇంటి వద్దకే పాలన.. కూటమిలో పెన్షన్ల కోసం తిప్పలు: వైసీపీ నేతలు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు ఇంటి ముంగిటకే అందాయని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో వృద్ధులు, వికలాంగులు పెన్షన్ల కోసం ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ జీకే వీధి మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కంకిపాటి నారాయణ విమర్శించారు. మంగళవారం జీకే వీధిలో విలేకరులతో మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వంలో సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకే తీసుకెళ్లారని పేర్కొన్నారు. ప్రతి నెల ఒకటో తేదీనే పెన్షన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్ద అందించే విధానం అమలు చేశారని తెలిపారు. ప్రస్తుతం పెన్షన్ల కోసం వృద్ధులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, కొత్త పెన్షన్ల దరఖాస్తుకు అనేక నిబంధనలు విధిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ పథకాలకు పేర్లు మార్చడం తప్ప కూటమి ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా అధ్యక్షుడు పాతూను లక్ష్మణ్ పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు సంసిద్ధం కావాలి - గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు

- ప్రజలతో మమేకమవుతూ పార్టీ బలోపేతం చేయాలి.
- గిరిజన రాష్ట్ర అధ్యక్షులు పాంగి రాజారావు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 08.** స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధత కావాలని, నిరంతరం ప్రజలతో మమేకమవుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పాంగి రాజారావు కాషాయ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భముగా బిజెపి మండల అధ్యక్షులు కొర్ర సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం మండల కార్యవర్గం, సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పాంగి రాజురావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవ సంకల్ప అభియాన్ కేవలం ఒక వేడుక కాదని, ప్రజా సేవకు మరింత విస్తృతం చేసే ఒక సంకల్ప కార్యక్రమమన్నారు. 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు ఆశీర్వాద దీపం, వ్యాసరచన, స్వచ్ఛ భారత్ వంటి తొమ్మిది కార్యక్రమాలు గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రెయ్యల మత్యారాజు, జిల్లా కార్యదర్శి వంతాల లక్ష్మణ్, మాజీ వైస్ ఎంపిపి గబుడు సీతారాం, మాజీ ఎంపిటిసి రెయ్యల నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి రెయ్యల నాగభూషణం, కోశాధికారి చిట్టపులి సాంబశివ, మండల ఉపాధ్యక్షులు మజ్జి సాధురం, దారపు తిరుపతి, అల్లంగి రామకృష్ణ, మండల కార్యదర్శి రెయ్యల నాగార్జున, యువమోర్చా మండల అధ్యక్షులు వంతల అర్జున్, కిషన్ మోర్చా మండల అధ్యక్షులు వనుగు కరిబాబు, నాయకులు నాగేశ్వరరావు, అర్జున్, సీతారాం అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఏరియా ఆసుపత్రిని సందర్శించిన జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి ఎల్. రాము.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 8.** చింతపల్లి ఏరియా ఆసుపత్రిని అల్లూరి జిల్లా ఆసుపత్రిల సమన్వయ అధికారి డాక్టర్ ఎల్ రాము ఆకస్మికంగా సందర్శించారు. మంగళవారం చింతపల్లి ఏరియా ఆసుపత్రికి వచ్చిన ఆయన ఆసుపత్రిలో అందుతున్న సేవలను స్వయంగా రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. వార్డులను, ఎమర్జెన్సీ వార్డులను, మందులు నిలువ చేసే గదిని ల్యాబ్ ను ప్రతి డిపార్ట్మెంట్ కి వెళ్లి వివరాలను తెలుసుకున్నారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలపై ఆసుపత్రి సూపరిండెంట్ ని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది ప్రేమ పూర్వక స్నేహ భావాన్ని ప్రదర్శిస్తూ వైద్య సేవలు అందించాలన్నారు. రోగుల పట్ల దురుసుగా ప్రవర్తించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ నీలవేణి, ఆర్ ఎం ఓ డాక్టర్ ఇ క్రమ్ అలీ ఖాన్, జనరల్ మెడిసిన్ డాక్టర్ పవన్, నర్సింగ్ సూపరిండెంట్ పద్మావతి, ఆసుపత్రి సూపరిండెంట్ రాజారావు, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్ పాల్గొన్నారు.


# గిరిజన అభివృద్ధికి టీడీపీ కృషి: కొట్టగుల్లి సుబ్బారావు



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గం జీకే వీధి మండలం పెదవలస పంచాయతీలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విశాఖపట్నం వెస్ట్ నియోజకవర్గం అబ్జర్వర్ కొట్టగుల్లి సుబ్బారావు మంగళవారం ఇంటింటి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధితో పాటు విద్యా, వైద్య రంగాల బలోపేతం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన, గిరిజనులకు 50 ఏళ్లకే పెన్షన్ వంటి పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను టీడీపీ ప్రభుత్వం, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలు చేశారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకుంటూ గ్రామస్థాయిలో టీడీపీని మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొండలరావు, యూనిట్ ఇన్‌చార్జి మహేష్, బీసీ సెల్ నాయకుడు శ్రీను, గ్రామ కమిటీ నాయకుడు నూకరాజు, ముమ్మిడి రాంబాబు, పీసా అధ్యక్షుడు గిరిబాబు, బూత్ కన్వీనర్ శ్రీనివాస్, కే. గాంధీతో పాటు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చౌడుపల్లి ఆదర్శ రైతు, నీటి సంఘం అధ్యక్షులు కంఠా వెంకటరమణమూర్తి మృతి.

- మండలంలోని పలువురు ప్రముఖుల పరామర్శ.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 8.** అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం, చౌడుపల్లి పంచాయతీ గ్రామ నివాసి ఆదర్శ రైతు నీటి సంఘం అధ్యక్షులు కంఠ వెంకటరమణమూర్తి మంగళవారం మృతి చెందారు. ఈయన చౌడుపల్లి పంచాయతీకి ఉప సర్పంచ్ గా సేవలను అందించారు. అభ్యుదయ వాది, స్నేహశీలి గా మండలంలో మంచి పేరు ప్రఖ్యాతులను సంపాదించుకున్నారు. గుండె సంబంధిత వ్యాధితో వారం రోజులుగా బాధపడుతూ విశాఖపట్నంలోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్సను పొందుతున్నారు. ఈ క్రమంలో గుండె సంబంధిత వ్యాధి తీవ్రతరం కావడంతో ఆసుపత్రిలోనే ఆయన తుది శ్వాసను విడిచారు. ఈయన మరణ వార్తను తెలుసుకున్న మండలంలోని పలువురు ప్రముఖులు ఆయన గృహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంచి స్నేహశీలిని కోల్పోయామని అన్నారు. కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని, మృతిచెందిన రమణమూర్తి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని వారు ప్రార్థించారు. మృతిచెందిన రమణకు భార్య, కుమార్తె జాహ్నవి, కుమారుడు బాలకృష్ణ ఉన్నారు. ఆదర్శ రైతు అయిన రమణమూర్తి కుమార్తెను వ్యవసాయ అధికారిగా ఉండాలని ప్రోత్సహించారు. ప్రస్తుతం ఈయన కుమార్తె జాహ్నవి ఎలమంచిలి అగ్రికల్చర్ డిపార్ట్మెంట్లో అడిషనల్ డైరెక్టర్ గా పనిచేస్తున్నారు. ఈయన మృతి పై పలువురు సంతాపాన్ని తెలిపారు.

# దారకొండలో పింఛన్ల నమోదుకు సాంకేతిక సమస్యలు

కొత్త నిబంధనలతో ఇబ్బందులు.. ఆందోళనలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు

**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దారకొండ స్వర్ణ గ్రామ సచివాలయంలో కొత్త పింఛన్ల నమోదుకు దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు సాంకేతిక సమస్యలు, మరోవైపు కొత్త నిబంధనలతో తమకు పింఛన్ మంజూరు అవుతుందో లేదోనని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గత రెండు రోజులుగా సచివాలయానికి వస్తున్నా సాంకేతిక సమస్యల కారణంగా దరఖాస్తులు నమోదు కావడం లేదని తెలిపారు. గడువు తక్కువగా ఉండటంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై మంగళవారం సచివాలయం ఎదుట మండల సీపీఐ నాయకుడు కవర్ల భగవాన్ ఆధ్వర్యంలో దరఖాస్తుదారులు నిరసన చేపట్టారు. గిరిజన ప్రాంతాల్లో పింఛన్ల




నమోదుకు ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, నిబంధనలను సడలించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పాంగి నాగేశ్వరరావు, పెసా అధ్యక్షుడు వంతల చిట్టినాయుడు, మాజీ ఎంపీటీసీ మాడి రామన్న, గడుతూరి రాజ్‌కోటి, కోడా నారాయణ, కిల్లో టొక్కుబాబుతో పాటు పలువురు పింఛన్ దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## ఈచ్ వన్ -- టీచ్ వన్: 2026 డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించిన వీ.ఐ.ఐ.టీ




**కూర్మన్న పాలెం: పెన్ పవర్, సెప్టెంబర్ 8:** అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటానమస్, దువ్వాడకు చెందిన జాతీయ సేవా పథకం విభాగం, విద్యార్థి కార్యకలాపాల మండలి , కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈచ్ వన్ -- టీచ్ వన్ 2026 పేరుతో డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని జెడ్.పీ.హెచ్. పాఠశాల, కతి ఆర్.హెచ్.సీ., వడ్లపూడి, విశాఖపట్నంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థులకు ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం, డిజిటల్ సాంకేతికతపై అవగాహన, సాంకేతికతను బాధ్యతాయుతంగా మరియు సురక్షితంగా వినియోగించే విధానాలను వివరించారు. కార్యక్రమంలో 20 మంది ఎన్.ఎస్.ఎస్. విద్యార్థి వాలంటీర్లు, 10 మంది అధ్యాపకులు పాల్గొని సుమారు 200 మంది పాఠశాల విద్యార్థులకు డిజిటల్ పరిజ్ఞానాన్ని అందించారు.

విద్యార్థులకు కృత్రిమ మేధస్సు సాధనాలను కూడా సరళమైన, విద్యార్థులకు అనువైన పద్ధతిలో పరిచయం చేశారు. విద్యాభ్యాసంలో ఏఐను ఒక సహాయక సాధనంగా ఎలా ఉపయోగించుకోవచ్చో, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సురక్షితంగా, సమర్థవంతంగా ఎలా వినియోగించుకోవచ్చో వివరించారు. ఇంటరాక్టివ్ సెషన్ల ద్వారా విద్యార్థుల్లో సాంకేతికతపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం మరియు బాధ్యతాయుత వినియోగంపై అవగాహన పెంపొందించారు.

ఈ కార్యక్రమాన్ని డా. పి. సన్యాసి రావు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ మరియు అసోసియేట్ ప్రొఫెసర్, ఎం.బి.ఏ. విభాగం, మరో నలుగురు అధ్యాపకుల సహకారంతో సమన్వయం చేశారు.

ఈ సందర్భంగా డా. జె. సుధాకర్, ప్రిన్సిపాల్; డా. వి. మధుసూదన రావు, రెక్టర్; శ్రీ చ. శివ రామ కృష్ణ, డీన్ -- స్టూడెంట్ అఫైర్స్; శ్రీ బి. దినేష్ రెడ్డి, హెచ్.ఓ.డీ.--సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్; మరియు డా. మహంతి మోహన్, ఇన్‌చార్జ్ హెచ్.ఓ.డీ.--అసోసియేట్ ప్రొఫెసర్ వాలంటీర్లు, అధ్యాపకులు మరియు కార్యక్రమ సమన్వయకర్తలను అభినందించారు. ఇలాంటి సమాజ సేవా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో డిజిటల్ అవగాహన, సాంకేతిక నైపుణ్యాలు మరియు బాధ్యతాయుత పౌరసత్వాన్ని పెంపొందించడం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.

# 90 శాతం రాయితీపై రాజ్మా విత్తనాల పంపిణీ

రైతులు సద్వినియోగం చేసుకోవాలి: టీడీపీ మండల అధ్యక్షుడు కొండలరావు

**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** గిరిజన రైతులకు ప్రభుత్వం 90 శాతం రాయితీపై అందిస్తున్న రాజ్మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని జీకే వీధి మండల టీడీపీ అధ్యక్షుడు పాతూరు కొండలరావు సూచించారు. పెదవలస పంచాయతీ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రైతులకు రాజ్మా విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు విత్తనాల విలువలో కేవలం 10 శాతం మాత్రమే చెల్లించి విత్తనాలను పొందవచ్చని తెలిపారు. రైతులు రాజ్మా సాగు చేసి మంచి దిగుబడులు సాధించి లబ్ధి పొందాలని సూచించారు. రాయితీపై అందుతున్న విత్తనాలను దళారులకు విక్రయించవద్దని, రైతులే సాగు చేసి ప్రయోజనం పొందాలని కొండలరావు కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి నాగశంకర్, నూకరాజు, గిరిబాబు, మహేష్, వీరయ్యదొర, ఈశ్వరరావు,



శ్రీనివాస్, రామారావు, ధర్మరాజు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అవగాహన ర్యాలీ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు గంజాయి, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

**జి.మాడుగుల.పెన్ పవర్. సెప్టెంబర్ (8)** మహిళల భద్రత, గంజాయి దుష్ప్రభావాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జి.మాడుగుల పోలీసులు మంగళవారం సంతబయలు సంతలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ సాయిరాం పడాల్ ఆధ్వర్యంలో జీఎంఎస్‌కేలు, పోలీసు సిబ్బంది పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు. అనంతరం సంతలో మహిళల భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహిళలపై నేరాలను అరికట్టాల్సిన అవసరాన్ని వివరిస్తూ పాల్గొన్నవారు నినాదాలు చేశారు. మహిళలకు రక్షణ కల్పించడంలో పోలీసులతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని అవగాహన కల్పించారు. సైబర్




మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గంజాయికి దూరంగా ఉండాలని సూచించారు.

# సంకాడలో జనసేనకు పెరుగుతున్న ఆదరణ చూసి వైసీపీలో వణుకు

- ప్రజల స్వచ్ఛంద చేరికలను బలవంతపు కండువాలనడం హాస్యాస్పదం: జనసేన



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** జీకే వీధి మండలం సంకాడ పంచాయతీలో జనసేన పార్టీకి రోజురోజుకూ పెరుగుతున్న ప్రజాదరణను చూసి వైసీపీ నాయకులు భయాందోళనకు గురవుతున్నారని సంకాడ పంచాయతీ జనసేన అధ్యక్షుడు ఊలం ఈశ్వర్‌రావు విమర్శించారు. సంకాడ పంచాయతీలోని గోవాడ, ఉసురుగూడెం, ఎర్నాపల్లి తదితర గ్రామాల నుంచి పలువురు ప్రజలు స్వచ్ఛందంగా జనసేనలో చేరుతున్నారని తెలిపారు. ప్రజలు తమ ఇష్టంతో జనసేన కండువాలు కప్పించుకుని, జెండాలను స్వీకరిస్తుంటే వాటిని బలవంతపు చేరికలుగా వైసీపీ నాయకులు ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. టీడీపీ నుంచి జనసేనలో చేరిన వారిని సైతం వైసీపీ నుంచి వచ్చిన వారిగా ప్రచారం చేస్తూ వాస్తవాలను వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు తమకు నచ్చిన రాజకీయ పార్టీని ఎంచుకునే స్వేచ్ఛ ఉందని, తప్పుడు ప్రచారాలతో వాస్తవాలను మార్చలేరని స్పష్టం చేశారు. సంకాడ పంచాయతీలో జనసేనకు పెరుగుతున్న స్పందనతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయని ఈశ్వర్‌రావు అన్నారు. ప్రజలకు ఎవరు ఏం చేశారో తెలుసని, ఇక తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే రోజులు పోయాయని పేర్కొన్నారు.

## కనకమహాలక్ష్మి ఆలయంలో వైభవంగా పూజలు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్ సెప్టెంబర్ 08 :** శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ప్రతి మంగళవా రం నిర్వహించే అష్టదళ పద్మారాధన సేవ, శ్రావణ లక్ష్మి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అష్టదళ పద్మారాధన సేవలో 10 మంది ఉభయదాతలు, శ్రావణ లక్ష్మి పూజల్లో 15 మంది ఉభయదాతలు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు బి.ఎన్. శేషు భట్టార్ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మ వారి ఆశీస్సులు పొందారు.

## చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 20 26 -27 విద్యా సంవత్సరంలో చేరగోరే ప్రథమ సంవత్సర విద్యార్థులు ఓ ఎ యం డి సి లెటర్ ను డౌన్లోడ్ చేసుకోవాలి.

- మొదటి విడతలు కళాశాలకు 299 సీట్లు కేటాయింపు.
- కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. వి రమణ.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 8.** 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతపల్లిలో ప్రథమ సంవత్సరం డిగ్రీలో చేరబోయే విద్యార్థిని విద్యార్థులు ఓ ఏ ఎం డి సి లో వారికి కేటాయించిన అలాట్మెంట్ లెటర్ ను డౌన్లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకొని కళాశాలకు వచ్చి ఆన్లైన్లో సబ్మిట్ చేయాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి రమణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒ ఎ ఎండిసి లో వారికి కేటాయించిన లెటర్ డౌన్లోడ్ చేసుకోవడంతో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను, నాలుగు పాస్పోర్ట్ సైజు ఫోటోలను, మూడు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకొని కళాశాలకు వచ్చి అడ్మిషన్ పొందాలని అన్నారు. మొదటి విడతలో భాగంగా కళాశాలకు 299 సీట్లను కేటాయించడం జరిగిందన్నారు. చింతపల్లి డిగ్రీ కళాశాలలో సీటు వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు ఈనెల 10వ తారీకు లోపు కళాశాలకు వచ్చి జాయిన్ అవ్వాలని ఆయన తెలియజేశారు.

## మెగా మహా రక్తదాన శిబిరంకు సన్నాహాలు

-గోడ పత్రికను ఆవిష్కరించిన ప్రసాదుల




**గాజువాక:పెన్ పవర్, సెప్టెంబర్ 08:** ప్రజాసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10తేదిన గాజువాక బీసీ రోడ్డు,దయాల్ నగర్ వర్తక సంఘం కల్యాణ మండపంలో మహా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు.ఈ మేరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాజువాక తెదేపా కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ చేతుల మీదుగా గోడ పత్రికను ఆవిష్కరించారు.ఫౌండేషన్ చైర్మన్ చలపాక గంగాధర్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని ఈ సారి రక్తదాన శిబిరంతో పాటు కంటి,దంత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ప్రసాదుల మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు.సమాజంలో రక్తదాన అవసరాన్ని గుర్తించి యువతను చైతన్యపరుస్తూ శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.స్వచ్ఛంద రక్తదానశీలో యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో డాక్టర్ కాల్విన్,ఎం. జగదీష్,పెంటకోట శివ, వి.కనకేశ్వరరావు,పిన్నింటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


## సెప్టెంబర్ 15లోపు రైతులంతా పంట నమోదు చేసుకోవాలి

- ఈ-కేవైసీ తప్పనిసరి.. రైతులకు మండల వ్యవసాయ అధికారి సురేష్ సూచన



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** మండలంలోని రైతులందరూ తమ పంటలను తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్ సూచించారు. జీకే వీధి-1 రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలోని మొత్తం పంట విస్తీర్ణంలో 86 శాతం పంట నమోదు పూర్తయిందని తెలిపారు. మిగిలిన పంట విస్తీర్ణానికి సంబంధించిన రైతులు సెప్టెంబర్ 15వ తేదీలోపు పంట నమోదు పూర్తి చేసుకోవాలని కోరారు.పంట నమోదు అనంతరం ఈ-కేవైసీ కూడా తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ-కేవైసీ పూర్తి చేసిన రైతులు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెట్టుబడి రాయితీ, ఎరువులు, రాయితీ విత్తనాలు పొందేందుకు అర్హులవుతారని వివరించారు.పంట నమోదు పూర్తయిన అనంతరం రైతుల మొబైల్‌కు వచ్చే లింక్ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని, అలాగే ఏపీఏఐఎంఎస్ 2.0 రైతు యాప్ ద్వారా లేదా రైతు సేవా కేంద్రంలోని లాగిన్ ద్వారా కూడా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. పంట నమోదు సక్రమంగా జరిగేందుకు ఈ-కేవైసీ పూర్తి చేయడం ఎంతో ముఖ్యమన్నారు.ఇటీవల ఎల్‌నినో ప్రభావంతో వారం రోజులుగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పంటలను బెట్ట పరిస్థితుల నుంచి రక్షించుకునేందుకు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ప్రత్యేక నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు పంటలకు సంబంధించిన సలహాలు, సూచనల కోసం 8331056449 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు మేఘమాల, గ్రామ ఉద్యాన సహాయకుడు కృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

# నిఘానేత్రంతో ముందస్తు నేర నివారణ



మామ కిచెన్ ఫుడ్ కోర్ట్‌లో 15 సీసీ కెమెరాల ఏర్పాటు

**గాజువాక:పెన్ పవర్, సెప్టెంబర్ 08:** విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ డీసీపీ లతా మాధురి , ఏసీపీ వెంకట్రావు ఆదేశాల మేరకు ముందస్తు నేర నివారణ చర్యల్లో భాగంగా నిఘానేత్రం కార్యక్రమాన్ని విశాఖపట్నం సిటీ పోలీసులు మరింత విస్తృతంగా అమలు చేస్తున్నారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని దొంగతనాలు, ఇతర ఆస్తి సంబంధిత నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పోలీస్ అధికారులు తెలిపారు. ఏపీ పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం అవసరమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మామ కిచెన్ ఫుడ్ కోర్ట్ యాజమాన్యానికి నోటీసు జారీ చేసి సూచించారు.

పోలీసుల సూచనలకు సానుకూలంగా స్పందించిన మామ కిచెన్ ఫుడ్ కోర్ట్ యజమాని జోగి నాయుడు 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. తుంగలం నుంచి షీలానగర్ వైపు వెళ్లే మార్గంలో, క్రైమ్ ప్రోన్ ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమైన మార్గాలు, ప్రధాన రహదారులు కవర్ అయ్యే విధంగా ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను క్రైమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ జీ.డి. బాబు , విజయ్ కుమార్ , పోలీస్ సిబ్బంది లాంఛనంగా ప్రారంభించారు.పోలీసుల సూచనలను వెంటనే అమలు చేసి ప్రజా భద్రతకు సహకరించిన మామ కిచెన్ ఫుడ్ కోర్ట్ యజమాని జోగి నాయుడు , సిబ్బందిని ఇన్స్పెక్టర్ జీ.డి. బాబు అభినందించారు. ప్రజల భద్రత కోసం వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు.ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి సీసీ కెమెరాలు నేరాల నివారణతో పాటు నేరం జరిగిన సందర్భంలో నిందితులను గుర్తించడం, నేరాలను ఛేదించడంలో కూడా ఎంతో ఉపయోగపడతాయని పోలీసులు తెలిపారు.

ఏపీ పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ నిబంధనలను పాటిస్తూ ప్రతి ఇంటి వద్ద, ప్రతి దుకాణం, వ్యాపార సంస్థ, ఫుడ్ కోర్ట్ మరియు ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో అవసరమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నిఘానేత్రం -- నేరాలకు అడ్డుకట్ట, ప్రజల భద్రతకు భరోసా అనే లక్ష్యంతో ప్రజలు, వ్యాపార సంస్థల యజమానులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

## ఎన్నికల కోసమే నూతన పింఛన్ల రాజకీయం



పెన్షన్ అప్లయ్ కు పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు.
సమయాన్ని పొడిగించాలనీ డిమాండ్.
వైసీపీ అల్లూరి సీతారామరాజు జిల్లా జెసిఎస్ కోఆర్డినేటర్ అరబీరు జగబంధు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 08.** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం కొత్త పెన్షన్ల మంజూరు విషయంలో రాజకీయం చేస్తోందని వైసిపి అల్లూరి సీతారామరాజు జిల్లా వైసిపి జేసిఎస్ కో ఆర్డినేటర్ అరబీరు జగబంధు ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. అప్లికేషన్ అందించుటకు లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ పడిగాపులు కాస్తున్నారనీ, రెండు రోజుల్లో అతి తక్కువ అప్లికేషన్లు ఆన్లైన్ అవుతుందని, ఇది లబ్ధిదారులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. అతి తక్కువ సమయాన్ని కేటాయించి ఎన్నికల్లో లబ్ధి పొందడానికే నూతన పింఛన్ల ప్రకటనలను ఒక సాధనంగా వాడుకుంటున్నారని ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ఈ అంశానికి సంబంధించి రాజకీయ వర్గాల్లోనూ, ప్రజల్లోనూ ప్రధానంగా చర్చలు జరుగుతుందని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కొత్త లబ్ధిదారులకు పింఛన్లు ఇచ్చే హామీలను సకాలంలో అమలు చేయకుండా, స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలోనే వీటిపై హడావుడి చేస్తున్నారని ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇవే కాకుండా సాంకేతిక కారణాలు లేదా ఇతర నిబంధనల పేరుతో ఉన్న పింఛన్లను నిలిపివేయడం లేదా కోత విధించడం ద్వారా ప్రభుత్వం పేదలను మోసం చేస్తోందని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకే పెన్షన్ల మంజూరు, పంపిణీ కార్యక్రమాలను ఆర్భాటంగా నిర్వహిస్తున్నారని అన్నారు. జోలాపుట్ సచివాలయంలో కొత్త పెన్షన్ కోసం లబ్ధిదారులు పడిగాపులు కాస్తున్నారనీ, రెండు రోజులకు గాను ఒకటి, రెండు అప్లికేషన్స్ తప్ప, ఆన్లైన్ అవనట్టువంటి పరిస్థితి నెలకొంది అన్నారు. సమయం దగ్గర పడటం, వరుసగా సెలవులు రావటం, అనేక నిబంధనలు అమలు ఉండటం వల్ల అనేక ఇబ్బందులు ఎదురయ్యే పరిస్తితి కనబడుతున్న నేపథ్యంలో తక్షణమే ఇచ్చిన సమయాన్ని పొడిగించి తగిన వెసులుబాటు కల్పించాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు దొర నీలకంఠం, దశరథ్, తిరుపతి, రామరాజు, సుందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రూ.35.90 లక్షలతో ఆధునీకరించిన చేపల మార్కెట్ ప్రారంభం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 08 :** దక్షిణ నియోజకవర్గం 36వ వార్డులో రూ.35.90 లక్షల వ్యయంతో ఆధునీకరించిన చేపల మార్కెట్‌ను ఎమ్మెల్యే, జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. మార్కెట్‌లో మౌలిక వసతుల కొరత కారణంగా మత్స్యకార మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టారు.మార్కెట్ అభివృద్ధి పనులు పూర్తి కావడంతో మత్స్యకార మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు పూలతో స్వాగతం పలికారు. మార్కెట్‌లో అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి రావడంతో వ్యాపార నిర్వహణకు ఇబ్బందులు తగ్గుతాయని వారు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులు, చిరు వ్యాపారులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, మత్స్యకార మహి ళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆఫ్‌లైన్ మరణ ధ్రువీకరణ పత్రాలను పింఛన్‌కు అనుమతించాలి

- ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి:
- టీడీపీ నాయకుడు అడపా సత్తిబాబు



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** గతంలో జారీ చేసిన ఆఫ్‌లైన్ మరణ ధ్రువీకరణ పత్రాలను కూడా పింఛన్ దరఖాస్తులకు చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు అడపా సత్తిబాబు కోరారు.మొండిగడ్డ పంచాయతీకి చెందిన గబులంగి పార్వతమ్మ మాట్లాడుతూ తన భర్త గబులంగి నారాయణరావు 2016 మే 2న సహజ మరణం చెందారని తెలిపారు. ఆ సమయంలో మరణ ధ్రువీకరణ పత్రాలను ఆఫ్‌లైన్ విధానంలో జారీ చేసేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం 2026లో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో ఆఫ్‌లైన్ మరణ ధ్రువీకరణ పత్రం చెల్లదని, ఆన్‌లైన్‌లో జారీ చేసిన ధ్రువీకరణ పత్రమే అవసరమని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో ప్రభుత్వ విధానం ప్రకారం జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను ఇప్పుడు చెల్లుబాటు కాకుండా చేయడం వల్ల వృద్ధులు, వితంతువులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అడపా సత్తిబాబు తెలిపారు. పాత ఆఫ్‌లైన్ మరణ ధ్రువీకరణ పత్రాలను కూడా పింఛన్ దరఖాస్తులకు పరిగణనలోకి తీసుకునేలా ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

## వైసిపి అభ్యర్థుల గెలుపే లక్ష్యం

- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి.
- అల్లూరి జిల్లా వైసిపి జెసిఎస్ కోఆర్డినేటర్ అరబీరు జగబంధు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 08.** వైసిపి బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధత కావాలని అల్లూరి జిల్లా వైసీపీ జెసిఎస్ కోఆర్డినేటర్ అరబీరు జగబంధు తెలిపారు. మంగళవారం మండలంలోని జోలాపుట్టు పంచాయతీ హెడ్ క్వార్టర్ లో వైసిపి పంచాయితీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం పంచాయితీ వైసిపి అధ్యక్షుడు సీసా దాశరధి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో 9 గ్రామాలకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి జగబంధు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడంతో అందరు సమిష్టిగా కలిసికట్టుగా పనిచేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచినటువంటి అభ్యర్థులను గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. వైసిపి చేసినటువంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయాలని, అదేవిధంగా కూటమి పాలన యొక్క వైఫల్యాలు ప్రజల వద్దకు తీసుకు పోయి వివరించాల్సిన అవసరం ఉందని కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భాగ్యవతి, పంచాయతీ మాజీ సర్పంచ్ నీలకంఠం, స్థానిక ఎంపిటిసి కమల, ఎండి సులేమాన్, బుద్ద, మాకవరం మాజీ సర్పంచ్ గంగాధర్, మాజీ ఉప సర్పంచ్ రామచందర్, నాయకులు తిరుపతి, రామరాజు, గణపతి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# న్యాయవాదుల రక్షణ చట్టం పటిష్టంగా అమలు చేయాలి.

-ప్రత్తిపాడులో విధులు బహిష్కరించి నిరసన తెలిపిన న్యాయవాదులు.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్ 08:** న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణమే పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి లంక గోపినాథ్ కు వినతి పత్రం అందజేసి కోర్ట్ విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజాల చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ రాజాల చిట్టిబాబు మాట్లాడుతూ న్యాయవాదులు తమ వృత్తి విధులు నిర్వహించే సమయంలో ఎదుర్కొంటున్న దాడులు, బెదిరింపులు, తదితర ఘటనల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టం అత్యవసరమన్నారు. న్యాయవాదుల భద్రత, సంక్షేమం,వృత్తి గౌరవాన్ని కాపాడేందుకు న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణమే అమలు చేయాలనీ డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ ట్రెజరర్ అవసరాల దేవి, స్పోర్ట్స్ ఒ కల్చరల్ సెక్రటరీ మంచికంటి శ్రీనివాస భారతి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రాయి అచ్యుత రామారావు,బార్ మాజీ అధ్యక్షులు చిట్టంశెట్టి పుల్లయ్య, బుగత వెంకట శివన్నారాయణ,సీనియర్ న్యాయవాదులు కాపీశెట్టి శ్రీనివాసరావు, ఆకాశపు మల్లేశ్వరరావు, పలివెల నాగేంద్ర రాజు,రెడ్నం వెంకటరెడ్డి, దాడి రవిచంద్ర, జోగా ప్రసాద్, అలమండ రాఘవ స్వామి, శ్రీమతి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.




## ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం:వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ డే సందర్భంగా రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి వైద్యులు, ఫిజియోథెరపిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ఆధునిక వైద్య రంగంలో ఫిజియోథెరపీకి ప్రత్యేక స్థానం ఉందన్నారు. కండరాలు, నరాలు, కీళ్లకు సంబంధించిన అనేక సమస్యలను ఫిజియోథెరపీ ద్వారా సమర్థవంతంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రమాదాలు, పక్షవాతం, వెన్నునొప్పి, కీళ్ల నొప్పులు వంటి సమస్యల నుంచి రోగులు త్వరగా కోలుకోవడంలో ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రామచంద్ర పురం ఏరియా ఆసుపత్రిలోని ఫిజియోథెరపీ యూనిట్‌కు అవసరమైన పరికరాలను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అలాగే రూ.16 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డయాలసిస్ యూనిట్‌ను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి అభివృద్ధి చెందుతోందని, నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి జరుగుతోందని అన్నారు.సీఎస్ఆర్ నిధులను నియోజకవర్గానికి తీసుకువచ్చి ఆరోగ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్,గొల్లపల్లి కృష్ణ,కంచుమర్తి బాబురావు,ఆర్ఎంఓ డాక్టర్ కె. హేమంత్ చక్రధర్,డాక్టర్ ఓ.ప్రసన్న, డాక్టర్ ఎం.బి.లోకనాథ్, డాక్టర్ మోహన్ బాబు,డాక్టర్ మౌనిక,డాక్టర్ సుష్మిత, నర్సింగ్ సూపరింటెండెంట్ జయప్రద, ఫార్మసీ సూపర్వైజర్ ఎం. చంద్రావతి, ఫిజియోథెరపిస్టులు బి.మేఘన,ఎం. సాయి లక్ష్మి, బయోమెడికల్ ఇంజనీర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గొల్లప్రోలు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం




**(గొల్లప్రోలు పెన్ పవర్ సెప్టెంబర్ :8)** గొల్లప్రోలు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 9వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అధికారి సైలేట్ రాజు తెలిపారు.మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించేందుకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు ఇప్పటికే సమాచారం అందించారు. సమావేశంలో మండలంలోని వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించనున్నారు.ముఖ్యంగా వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక శాఖ, విద్యుత్, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, తాగునీరు, పారిశుధ్యం, విద్య, మహిళా శిశు సంక్షేమం, ఉపాధి హామీ పథకం తదితర శాఖలపై సమీక్ష జరిగే అవకాశం ఉంది.మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకోనున్నారు. సంబంధిత శాఖల అధికారులు సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, ఆయా శాఖల పనితీరుపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

## 'మన గ్రామం--మన బాధ్యత' విజయవంతానికి సమష్టి కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.






**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన గ్రామం--మన బాధ్యత' కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రతి నెల మూడో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు.మంగళవారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, ఈ నెల 23వ తేదీ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. ప్రతి నెల రెండో బుధవారం ప్రిపరేటరీ సమావేశం నిర్వహించి, మూడో బుధవారం ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పంచాయతీ ప్రత్యేక అధికారులు కీలక పాత్ర పోషించాలని, పంచాయతీ కార్యదర్శులు సమావేశాల కన్వీనర్లుగా వ్యవహరించి గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రామాల్లో పారిశుధ్యం, ప్రజారోగ్యం, విద్య, మహిళా--శిశు సంక్షేమం, సురక్షిత తాగునీటి సరఫరా తదితర అంశాలపై శాఖల వారీగా సమగ్ర నివేదికలు రూపొందించి సమావేశంలో చర్చించాలని కలెక్టర్ సూచించారు. ఏఎన్ఎం,ఆశా,ఎంఎస్కే సిబ్బంది హోమ్ సర్వే నిర్వహించి గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితులపై నివేదికలు రూపొందించాలన్నారు. సమావేశాల్లో చర్చించిన అంశాలపై మినిట్స్ నమోదు చేసి, తదుపరి సమావేశంలో తీసుకున్న చర్యలను సమీక్షించాలని తెలిపారు.పంచాయతీ ప్రత్యేక అధికారులు ప్రతిరోజూ పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ చెత్త సేకరణ, తడి--పొడి చెత్త వేరు చేయడం, డ్రైనేజీల శుభ్రత సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. తాగునీటి వనరులు,సరఫరా వ్యవస్థను తనిఖీ చేసి నీటి నాణ్యత, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సేవలు సక్రమంగా అందుతున్నాయో పరిశీలించడంతో పాటు రక్తహీనత, పోషకాహార లోపం, బాల్య వివాహాల నివారణ, బాలల హక్కులు, మహిళల భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలును పర్యవేక్షించాలని, డ్రాప్‌అవుట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించాలన్నారు.గర్భిణులు, బాలింతలు,చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ టీకాలు, తల్లి--శిశు ఆరోగ్య సేవలు సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు.

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలను కార్యక్రమంలో చురుగ్గా భాగస్వామ్యం చేసి గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి, జీవనోపాధి అవకాశాల పెంపునకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా పంచాయతీ అధికారులు కార్యక్రమం అమలు తీరును సమగ్రంగా పర్యవేక్షించి, గ్రామాల్లోని లోపాలను గుర్తించి తక్షణమే సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు.

'మన గ్రామం--మన బాధ్యత' కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు,యువత, విద్యార్థులు,మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు చురుగ్గా పాల్గొని గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జి. శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో కె. అనిత, ఐసీడీఎస్ పీడీ సీహెచ్. లక్ష్మి, డీఈవో పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏలినోవా పై అవగాహన డిస్కషన్ లో వర్మ



**పిఠాపురం పెన్ పవర్సెప్టెంబర్ 8.** చంద్రబాబు నాయుడు దూరదృష్టి వలన నీటి యాజమాన్యం పై ఉన్న అవగాహన వలన ఏలినోవా పరిస్థితులు మనకి ఎఫెక్ట్ కాకుండా ఏలేరు ఆయకట్టు కింద ఉన్న ఐదు నియోజకవర్గాలు ముఖ్యంగా టైల్ ఎండ్ పిఠాపురం తో సహా పిఠాపురం రైతులు సాధించిన పురుషోత్తపట్నంతో సుమారు లక్ష ఎగరాలకి తొలకరి పంట పండించే విధంగా నీటి యాజమాన్యం చంద్రబాబు నాయుడు చేయడం జరిగింది. దీంతోపాటు లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ నుంచి గోదావరి నీళ్లు అనకాపల్లి వరకు తీసుకెళ్లి అక్కడ రైతులకి కాపాడడం జరిగింది ఎలినోవా ప్రభావం దాల్వా పంటకి లేకుండా ఉండడానికి మనం కొన్ని నిర్ణయాలు తీసుకోవాలని తెలియజేయడం జరిగింది వాటిలో ముఖ్యంగా గొలుసు కట్టి చెరువు లు ఏదైతే అని నియోజకవర్గాల్లో ఉన్నాయో ఆ చెరువున్ని కూడా నింపి మధుములు లాక్ చేయవలసిన అవసరం ఉందని చెప్పి తెలియజేయడం జరిగింది.ముందు జాగ్రత్తగా వచ్చి వేసవికి ఈ చెరువుల్లో పూడికలు తీయకుండా ఉండేవిధంగా చర్యలు తీసుకుని నీటిని నింపి వ్యవసాయానికి ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ చర్చిలో వర్మ తెలియజేయడం జరిగింది

## కౌలు రైతుల సంక్షేమానికి సీసీఆర్సీ భరోసా: జేసీ అపూర్వ భరత్



**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** భూ యజమానుల హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా వాస్తవ సాగుదారులు, కౌలు రైతులకు సంస్థాగత పంట రుణాలు, ప్రభుత్వ ప్రయోజనాలు అందించడంలో పంట సాగుదారు హక్కుల పత్రం (సీసీఆర్సీ) కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులపై అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ 9 నుంచి వారం రోజుల పాటు గ్రామస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారు హక్కుల చట్టం--2019 కింద జారీ చేసే సీసీఆర్సీ ద్వారా కౌలు రైతులకు పంట రుణాలు, పంట బీమా, పెట్టుబడి రాయితీ, పంట నష్ట పరిహారం తదితర ప్రభుత్వ ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని జేసీ తెలిపారు. సీసీఆర్సీ సాధారణంగా ఒక పంట సంవత్సరంలో గరిష్టంగా 11 నెలలు మాత్రమే చెల్లుబాటు అవుతుందని, దీనివల్ల సాగుదారుకు భూమిపై ఎలాంటి యాజమాన్య లేదా శాశ్వత కౌలు హక్కులు సంక్రమించవని స్పష్టం చేశారు.భూ యజమాని, కౌలు రైతు పరస్పర అంగీకారంతో చేసుకున్న ఒప్పందాన్ని వీఆర్వో లేదా గ్రామ సచివాలయం ద్వారా ధ్రువీకరించిన అనంతరం సీసీఆర్సీ జారీ చేస్తారని తెలిపారు. పంట రుణాల మంజూరులో బ్యాంకులు సీసీఆర్సీని పరిగణనలోకి తీసుకోవాలని, కౌలు రైతు బకాయిల వసూలు కోసం ఒప్పంద పరిధిలోని భూమిని జప్తు చేయడానికి వీలుండదని పేర్కొన్నారు.సీసీఆర్సీల జారీ, కౌలు రైతులకు కలిగే ప్రయోజనాలపై వ్యవసాయ శాఖ విస్తృత అవగాహన కల్పించాలని జేసీ సూచించారు. గ్రామ సచివాలయాలు, రెవెన్యూ అధికారులు బ్యాంకులతో సమన్వయం చేసుకుని అర్హులైన సీసీఆర్సీదారులకు 'స్కేల్ ఆఫ్ ఫైనాన్స్' ప్రకారం సంస్థాగత పంట రుణాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన చోట అర్హులైన కౌలు రైతులతో ఉమ్మడి బాధ్యత సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు.దేవాదాయ శాఖ భూములకు కూడా సంబంధిత ఈఓ అంగీకారంతో సీసీఆర్సీలు జారీ చేయవచ్చని తెలిపారు.సెప్టెంబర్ 9 నుంచి ఏడు రోజుల పాటు ప్రతి రైతు భరోసా కేంద్రం స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, క్షేత్రస్థాయిలో కౌలు రైతులను గుర్తించి వెంటనే సీసీఆర్సీలు ఇప్పించడంతో పాటు బ్యాంకులతో అనుసంధానం చేసి పంట రుణాలు మంజూరు చేయించేలా చర్యలు చేపడతామని జేసీ వెల్లడించారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో కాకినాడ జిల్లాలో 70 వేల సీసీఆర్సీ కార్డులు జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు 37,398 కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే 5,647 మంది కార్డుదారులకు సుమారు రూ.23.97 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి కౌలు రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేసీ పిలుపునిచ్చారు.

## కాంట్రాక్ట్ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి..

-రాచపల్లి పి హెచ్ సి వద్ద వైద్య ఆరోగ్య శాఖ జేఏసీ నిరసన.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగులు కాంట్రాక్ట్ సిబ్బందికి మద్దతుగా నిలిచి తమ సంఘీభావం తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ స్టాఫ్, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎం ఎల్ హెచ్ పి లు, ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జేఏసీ డిమాండ్లకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

?ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ కన్వీనర్ ఎం.అజయ్ కుమార్ మాట్లాడుతూ సర్వీసులో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ తక్షణమే రెగ్యులర్ చేయాలని, క్రమబద్ధీకరణ జరిగే వరకు 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో లేదా ప్రమాదవశాత్తూ కాంట్రాక్ట్ ఎంప్లాయ్ మరణిస్తే ఆ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు, కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగ సదుపాయం కల్పించాలని కోరారు.సిబ్బంది అందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న వారికి ట్రాన్స్‌ఫర్స్ అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. జేఏసీ డిమాండ్లు ఎంతో న్యాయమైనవని, ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ కన్వీనర్ ఎం. అజయ్ కుమార్,పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసు ఉద్యోగాల ధర్నాతో శ్యామ్‌కు సంబంధం లేదు

- "మా సంస్థ ద్వారా పోలీసులను తయారు చేశాను.. నేరస్తులను కాదు"
- వసతి గృహంపై పోలీసుల దాడులపై శ్యామ్ కన్నీటి ఆవేదన

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 8** : పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టాలని కోరుతూ విద్యార్థులు కాకినాడ జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాతో తమ శ్యామ్ ఇన్‌స్టిట్యూట్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆ సంస్థ అధినేత గుంటూరి తణుకులు (శ్యామ్) స్పష్టం చేశారు. విద్యార్థులకు శిక్షణ అందించి సమాజానికి ఉన్నత విలువలు కలిగిన పోలీసులను అందించాలన్నదే తమ లక్ష్యమని, నేరస్తులను తయారు చేయడం తమ ఉద్దేశం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. తన వసతి గృహంపై పోలీసులు దాడులు చేసి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేశారంటూ మంగళవారం మీడియా ఎదుట శ్యామ్ కన్నీటి పర్యంతమయ్యారు.పోలీసు ఉద్యోగాల భర్తీ కోసం విద్యార్థులు సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించిన నేపథ్యంలో పోలీసులు తనను మధ్యాహ్నం పిలిపించి రాత్రి వరకు విచారించారని శ్యామ్ తెలిపారు. అయితే ధర్నాతో తనకు, తన సంస్థకు ఎలాంటి సంబంధం లేకపోయినా, మంగళవారం తెల్లవారుజామునే తమ వసతి గృహంపై పోలీసులు దాడులు చేయడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. విద్యను అభ్యసించేందుకు వసతి గృహంలో ఉన్న విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయడం బాధాకరమని చెప్పారు.

### 26 ఏళ్లుగా విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం

తాను, తన భార్య ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలను వదులుకుని 26 ఏళ్లుగా విద్యార్థుల భవిష్యత్తు కోసం శ్యామ్ ఇన్‌స్టిట్యూట్‌ను కొనసాగిస్తున్నామని శ్యామ్ తెలిపారు. ఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానని, తమ సంస్థపై నమ్మకంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఎంతోమంది అభ్యర్థులు పోలీసు ఉద్యోగాల శిక్షణ కోసం వస్తున్నారని చెప్పారు.

ఉద్యోగం కోసం శిక్షణ పొందుతున్న నిరుద్యోగుల కష్టాలను దగ్గరగా చూస్తున్నానని ఆయన తెలిపారు. ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు ఉంటూ, కనీస సౌకర్యాలు లేకుండా, తిండికి కూడా ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులను చూసి తాను ఆవేదన చెందుతున్నానన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

### 25 వేల మందికి పోలీసు ఉద్యోగాలు

ఇప్పటివరకు తమ శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా సుమారు 25 వేల మంది పోలీసు యూనిఫాం ఉద్యోగాలు పొందారని శ్యామ్ తెలిపారు. తమ వద్ద శిక్షణ పొందిన వారు సమాజానికి సేవ చేసే విధంగా తీర్చిదిద్దడమే తమ సంస్థ ఉద్దేశమని చెప్పారు. పోలీసు శాఖలో ఉద్యోగాల సంఖ్య పెంచాలని కోరుతూ తాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి వినతిపత్రం అందించిన విషయాన్ని కూడా ఆయన గుర్తుచేశారు.

### కుట్ర కోణంపై అనుమానం

తనకు ఎవరితోనూ వ్యక్తిగత వైరం లేదని, అందరితో సన్నిహితంగా ఉంటానని శ్యామ్ పేర్కొన్నారు. అయినప్పటికీ తమ సంస్థపై పోలీసులు దాడులు చేయడం వెనుక ఏదో కుట్ర కోణం ఉండవచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో తమ సంస్థ ప్రతిష్ట దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారని, వారిపై నమోదైన కేసులను ఎత్తివేయాలని శ్యామ్ కోరారు. తనపై నమోదైన కేసు విషయంలో మాత్రం న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు. సంస్థపై జరిగిన దాడులకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకుంటున్నానని, వాస్తవాలు వెలుగులోకి వచ్చిన వెంటనే వాటిని బహిర్గతం చేస్తానన్నారు.




### "నా సమయం మొత్తం విద్యార్థుల కోసమే"

వివాదాలు, రాజకీయ వైరాలు తనకు తెలియవని, తన సమయాన్ని మొత్తం విద్యార్థుల భవిష్యత్తు కోసం కేటాయించడమే తన లక్ష్యమని శ్యామ్ తెలిపారు. పోలీసు ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న యువతకు అండగా నిలవడమే తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. "నా సంస్థ ద్వారా పోలీసులను తయారు చేశాను.. నేరస్తులను కాదు" అంటూ శ్యామ్ చేసిన వ్యాఖ్యలు, మీడియా సమావేశంలో ఆయన కన్నీటి ఆవేదన అక్కడున్న వారిని కలచివేసింది. విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేస్తున్న విద్యాసంస్థపై జరిగిన ఘటనకు సంబంధించి వాస్తవాలను ప్రభుత్వం, పోలీసు అధికారులు వెలుగులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

## అక్షరాస్యతే అభివృద్ధికి పునాది : డాక్టర్ నాయుడు




**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 8**: అక్షరాస్యత కేవలం చదవడం, రాయడం మాత్రమే కాదని, జీవితాన్ని మార్చే శక్తి అని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు అన్నారు. లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా "ఆధునిక కాలంలో డిజిటల్ అక్షరాస్యత" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి పోటీల ద్వారా తమ ఆలోచనలను పంచుకోవడం అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజంలో అక్షరాస్యత ప్రాముఖ్యతను చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, డి. అశ్విని,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## గ్రీన్ క్లైమేట్ ఫండ్ ప్రాజెక్ట్ పురోగతిపై కలెక్టర్ సమీక్ష




**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** కాకినాడ జిల్లాలో గ్రీన్ క్లైమేట్ ఫండ్ (జీసీఎఫ్) ఆధ్వర్యంలో ఈసీఆర్ఐసీసీ ప్రాజెక్ట్ ద్వారా తీరప్రాంత ప్రజల్లో వాతావరణ మార్పులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రాజెక్ట్ బృందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో మడ అడవుల (మ్యాంగ్రూవ్) పునరుద్ధరణ, పర్యావరణ వ్యవస్థల పరిరక్షణతో పాటు తీరప్రాంత ప్రజలకు ప్రత్యామ్నాయ, సుస్థిర జీవనోపాధి అవకాశాల కల్పనపై విస్తృతంగా చర్చించారు. అలంకార చేపల పెంపకం, సముద్రపు నాచు (సీవీడ్) సాగు, సముద్రంలో కేజ్ కల్చర్, ఫిన్‌ఫిష్ పెంపకం వంటి జీవనోపాధి యూనిట్ల ఏర్పాటుపై ప్రత్యేకంగా చర్చ జరిగింది.

ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిపాదిత కార్యక్రమాలను సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత సంవత్సరంలో పనులను మరింత వేగవంతం చేయాలని, స్పష్టమైన లక్ష్యాలు, ప్రాంతాలు, బాధ్యతలు, కాలపరిమితితో కూడిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను వెంటనే సిద్ధం చేయాలని సూచించారు.కాకినాడ జిల్లాలో తీరప్రాంత పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించడంతో పాటు స్థానిక ప్రజలకు సుస్థిర జీవనోపాధి అవకాశాలు కల్పించడం, వాతావరణ మార్పుల ప్రభావాలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా తీరప్రాంత సమాజాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం, జీసీఎఫ్--ఈసీఆర్ఐసీసీ బృందం సమన్వయంతో ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో యూఎన్‌డీపీ ఇండియా ప్రోగ్రాం అనలిస్ట్ రాజత్ చౌదరి, స్టేట్ ప్రాజెక్ట్ అసోసియేషన్ రవికుమార్, రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్ సత్య శర్మ, జిల్లా కోఆర్డినేటర్ ఎల్. శ్రీహర్ష, ఇతర బృంద సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజలకు సకాలంలో రెవెన్యూ సేవలు అందించాలి

: జేసీ అపూర్వ భరత్



**సామర్లకోట, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** ప్రజలకు సకాలంలో రెవెన్యూ సేవలు అందేలా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశించారు. మంగళవారం సామర్లకోట మండల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలు, రికార్డు రూమ్, సిబ్బంది హాజరు పట్టికలను జేసీ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చిన అర్జీల పరిష్కార పురోగతిని సమీక్షించారు. అనంతరం మండలంలోని వీఆర్వోలు, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించి మీ సేవ డ్యాష్‌బోర్డులోని వివరాల ఆధారంగా రీ సర్వే, పట్టాదారు పాస్ పుస్తకాలు, 22ఏ, మ్యూటేషన్ తదితర భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులపై తీసుకున్న చర్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న సుపరిపాలనను ప్రజలకు చేరువ చేయడంలో రెవెన్యూ అధికారులు కీలక పాత్ర పోషించాలన్నారు. అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పీజీఆర్ఎస్, 22ఏ, రీ సర్వేలకు సంబంధించిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. భూ పరిపాలన అంశాలపై రాష్ట్ర ఉన్నతాధికారులు ప్రతివారం సమీక్షిస్తున్నందున, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసి పురోగతి సాధించాలని సూచించారు.కార్యాలయ పరిసరాలు, రికార్డు రూమ్‌లను కూడా పరిశీలించిన జేసీ కార్యాలయ ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. తనిఖీలో తహశీల్దార్ చంద్రశేఖర రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్, రీ సర్వే తహశీల్దార్లు, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పరిశ్రమలు ఖాళీ స్థలాలను హరిత వనాలుగా మార్చాలి



: ఏపీ గ్రీన్ ఛైర్మన్ నాగబాబు

**తొండంగి, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** పర్యావరణ, జీవవైవిధ్య పరిరక్షణకు పరిశ్రమలు తమ గ్రీన్‌బెల్ట్‌ను మరింత విస్తరించి, స్థానిక వృక్ష జాతులతో దట్టమైన పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ నాగబాబు సూచించారు. పరిశ్రమల యాజమాన్యాలు, ఉద్యోగులు సమష్టి బాధ్యతతో కృషి చేసినప్పుడే స్థిరమైన గ్రీన్‌బెల్ట్‌ను అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని అన్నారు. మంగళవారం కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడి గ్రామంలోని దివిస్ లేబొరేటరీస్‌ను నాగబాబు సందర్శించి పరిశ్రమలో కొనసాగుతున్న గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి, ప్లాంటేషన్ కార్యక్రమాలను సమీక్షించారు. పరిశ్రమ పరిధిలోని ఖాళీ ప్రదేశాలను దశలవారీగా హరిత వనాలుగా మార్చాలని, పెద్దగా పెరిగే స్థానిక వృక్ష జాతులకు ప్రాధాన్యం ఇచ్చి మొక్కలు నాటాలని సూచించారు. అనుకూలమైన ప్రాంతాల్లో మియావాకి పద్ధతిలో దట్టమైన వనాలను అభివృద్ధి చేయాలని, నాటిన మొక్కల సంరక్షణ, మనుగడపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.అనంతరం దివిస్ పరిశ్రమ ప్రాంగణంలో ఇప్పటికే అభివృద్ధి చేసిన గ్రీన్‌బెల్ట్, మొక్కలు నాటిన ప్రాంతాలను పరిశీలించారు. భవిష్యత్‌లో మరింత హరిత ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించారు. పరిశ్రమ ప్రతినిధులు ప్రస్తుత ప్లాంటేషన్ కార్యక్రమంతో పాటు గ్రీన్‌బెల్ట్ విస్తరణకు రూపొందించిన ప్రణాళికలను నాగబాబుకు వివరించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా దివిస్ లేబొరేటరీస్‌కు చెందిన 100 మందికి పైగా ఉద్యోగులతో కలిసి నాగబాబు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉద్యోగులు చురుకుగా పాల్గొనడాన్ని ఆయన అభినందించారు. ఇప్పటివరకు పరిశ్రమ ప్రాంగణంలో వివిధ జాతులకు చెందిన 25,150 మొక్కలు నాటినట్లు పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. అనంతరం దివిస్ లేబొరేటరీస్ ప్రతినిధులు సంస్థ చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవలకు కేటాయిస్తున్న నిధులు, వాటి వినియోగం, వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను నాగబాబుకు అందించారు.

## నిరుద్యోగ పోలీస్ అభ్యర్థులను వేధించడం తగదు:సీపీఎం



**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోలీస్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ కాకినాడలో భారీ ర్యాలీ చేపట్టిన నిరుద్యోగ పోలీస్ ఉద్యోగ అభ్యర్థులను పోలీసులు వేధించడం తగదని సీపీఎం నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో డి. తిప్పే నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఇప్పటికే వయోపరిమితి దాటిపోతుండటంతో ఉద్యోగాలు వస్తాయో లేదోనని నిరుద్యోగ అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారని, అలాంటి వారిపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. కాకినాడలో పోలీస్ ఉద్యోగాలకు శిక్షణ ఇచ్చే శ్యామ్ ఇన్‌స్టిట్యూట్‌పై పోలీసులు దాడులు చేసి విద్యార్థులను భయాందోళనలకు గురిచేస్తున్నారని డీఆర్వో దృష్టికి తీసుకువచ్చారు. ఇన్‌స్టిట్యూట్ అధినేత శ్యామ్‌ను సోమవారం పోలీసులు స్టేషన్‌కు పిలిచి రాత్రి వరకు ఉంచి వేధించడం తగదని పేర్కొన్నారు.కాకినాడ నగరంలో నేరాల సంఖ్య పెరుగుతోందని, విద్యార్థులకు గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సులభంగా లభిస్తున్నాయని, వాటిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలని సీపీఎం నాయకులు కోరారు. నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, తక్షణమే పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేసి ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.డీఆర్వోను కలిసిన వారిలో సీపీఎం నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, పెద్దింశెట్టి రామకృష్ణారావు, చింతపల్లి అజయ్‌కుమార్, తొట్టిపూడి రాజా తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి





జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్.

**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 8** సీఎం చంద్రబాబు కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మంగళవారం అంబాజీపేట మండలం, ఇరుసుమండ గ్రామంలో భూ పరిపాలన కమిషనర్ జయలక్ష్మి,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమీషనర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ వై.ఖోమ్. నైడియా దేవి తో కలిసి సభా స్థలి, హెలిప్యాడ్, పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ వంటి అంశాలపై అంబాజీపేట పేట మండలం జయంతి నగర్ గ్రామంలో అర్హులైన లబ్దిదారుల కుటుంబాలకు స్వయంగా వెళ్లి పట్టాదారు పాసు పుస్తకాల వివరాలు పరిశీలించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేసి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, రవాణా, పార్కింగ్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ అమలాపురం కె. సరళావతి, కొత్తపేట ఆర్డీఓ జి.వి.వి సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్స్ కె. ప్రభాకర్,తహసీల్దార్ చిన బాబు, రాజోలు తహసీల్దార్ భాస్కర్ రావు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com